సెప్టెంబర్-అక్టోబర్ 2010

హనీబీఎపి

# పల్లెసృజన

సంపుటి 5, సంచిక 2

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

Visit us : www.pallesrujana.org



## గ్యాస్ ఆధారిత బేకరీ ఓవెన్


తయారు చేసిన 'చిడిపి నాగభూషణం'





## సంపూర్ణ సేంద్రియ గ్రామం 'ఎనబావి'

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

✤ 82 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్‌లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ ఇప్పటి వరకు 16 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్‌లో జనవరి 2010 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో మన ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్‌మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ గత నాలుగేళ్లలో 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించింది.

✤ 42 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని 130 గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

✤ చింతకింది మల్లేశం ఆసు మిషన్‌కు, నరసింహాచారి కాలిపోయిన ట్యూబ్‌లైట్లను వెలిగించే పరికరానికి ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.

✤ ఇష్వాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.

✤ చింతకింది మల్లేశం పరిశోధనకు గాను రాష్ట్రపతి ద్వారా ప్రథమ జాతీయ పురస్కారం .

✤ 1 మార్చి, 2010న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్నోవేటర్లు, అధికారులు, అనధికారుల సమ్మేళనం అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడం.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.

✤ కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు నల్లమల అడవులలోని మొక్కలతో చేసిన ప్రయోగాలు అద్భుత ఫలితాలు సాధించాయి. వీటివల్ల మనుషులకు, పశువులకు, పంటలకు ఎంతో లాభం చేకూరింది. ఈ అద్భుత లక్షణాలుగల మొక్కలను పరీక్షించటానికి హనీబీఏపి "సి.సి.ఎం.బి., హైదరాబాద్"తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పరిశోధనా సంస్థలకు, పల్లె జ్ఞానానికి ఇదొక వినూత్న సంధానం.

✤ ఫోర్బ్స్ పత్రిక చింతకింది మల్లేశానికి అంతర్జాతీయ గుర్తింపుగా భారతదేశంలో అతి శక్తిశాలురైన ఏడుగురు గ్రామీణ ఇన్నోవేటర్లలో ఒకరిగా ఎన్నుకుంది.

✤ ఐ.ఎన్.కె. ఇంటర్‌నేషనల్ సంస్థ చింతకింది మల్లేశంను 'ఐ.ఎన్.కె. ఫెలో'గా గుర్తించి, లవాసా, పూనాలో జరిగిన అంతర్జాతీయ ఇన్నోవేషన్ సదస్సుకు డిసెంబర్, 2010లో ఆహ్వానించి, సత్కరించింది.

✤ గత మూడు నెలల్లో వంద మంది కొత్త సభ్యులుగా సభ్యత్వాన్ని స్వీకరించారు.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

✤ 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో-ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-5 సంచిక - 2 సెప్టెంబర్-అక్టోబర్ 2010


## సంపాదకవర్గం

సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగులగణేశం

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
జె. శశిమోహన్
పల్లె వీర రాఘవ రెడ్డి

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040- 27665655
సెల్ : 93913 75655, 800 888 5655
E-mail : narendragrafix@gmail.com



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555, 98660 01678
E-mail : honeybeeap@gmail.com
Visit us at : pallesrujana.org


## ఈ సంచికలో...


☞ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - 3

☞ సంపూర్ణ సేంద్రియ గ్రామం 'ఎనబావి' - 5

☞ యం.ఐ.టి. (అమెరికా) వారికి స్ఫూర్తినిచ్చిన భారతదేశ గ్రామీణవాసి ఆలోచన - 11

☞ వరంగల్ జిల్లాలో సేకరించిన సాంప్రదాయ జ్ఞానం - 13

☞ ఇగ్నైట్-2011 - 15

☞ సహజ ఎరువులు - కషాయాలు - 18

☞ గ్యాస్ ఆధారిత బేకరీ ఓవెన్ తయారు చేసిన 'చిడిపి నాగభూషణం' - 22

☞ మన ఔషధ మొక్కలు - 26

☞ ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 32


**కవర్ లోపలి పేజీల్లో :**


హనీబీఏపి ప్రగతి
శక్తి బుల్లెట్ శాంతి-మోటార్ సైకిల్‌తో నడిచే నాగలి


**మధ్య పేజీలో**


కళాశాల విద్యార్థుల సృజనాత్మకత



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by : Brig. P. Ganesham on behalf of "HoneyBeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P. Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం

మనదేశంలో 30 సంవత్సరాల లోపు వయసున్న యువకుల సంఖ్య మొత్తం జనాభాలో సగంకంటే ఎక్కువగా ఉంది. ఈ యువశక్తి మనకు పెన్నిధి. ఈ మహాశక్తిని మనం దేశాభివృద్ధికి ఎలా ఉపయోగించుకుంటామో మనమీదే ఆధారపడి ఉంది. ఈ యువత 21వ శతాబ్దానికి చెందినది. మంచి అవగాహన, ఉన్నత విద్య, ఉత్సుకత, కలిగిన ఎంతో శక్తివంతమైన సమూహము. వీరి శక్తిని మనం చాలా సావధానంగా సమగ్ర ఆలోచనలతో సుస్థిరత్వాన్ని సాధించే మార్గంలో ఉపయోగించే విధివిధానాలను రూపొందించాలి, అవసరాలు సృష్టించాలి.

ఈ విద్యావంతులైన యువకుల్ని మనం ప్రధానంగా రెండు గ్రూపులుగా విభజించవచ్చు. విద్యావంతులు - ప్రావీణ్యతలు ఉన్నవాళ్ళు. వీరికి పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి. కొంత పోటీవున్నా, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఉద్యోగాలకు మంచి అవకాశం ఉంది. అయితే అందరూ గొర్రెదాటుగా సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఉద్యోగం చేయాలి అని అనుకుంటే కాంపిటీషన్ పెరిగి నిరుద్యోగానికి దారి తీస్తోంది. ఇప్పుడు సమాజంలో ఉద్యోగావకాశాలు ఎన్నో రంగాల్లో ఉన్నాయి. యువత ఒకే రంగంలో కాకుండా అన్ని రంగాల్లో పనిచేయడానికి అర్హతలు సంపాదించాలి.

రెండవ వర్గం - విద్యావంతులు కాని సరియైన ప్రావీణ్యతలు లేనివాళ్ళు. వీరికి ఉద్యోగాలు లభించడం కష్టమైంది. వీరు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలవారు వ్యవసాయం చేయడానికి అందరూ ఇష్టపడరు. వీరికి మనం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యోగావకాశాలు కల్పించాలి. వారికి సరైన పెట్టుబడి, మార్గదర్శకత్వం చేసి వారి శక్తి గ్రామీణ అవసరాలను, పరికరాలను తయారు చేయడానికి ఉపయోగించాలి. ప్రాంతీయ వనరులతో, స్థానిక కార్మికులతో, ఆ ప్రాంతంలోని ప్రజల అవసరాలకు తగ్గట్టు ఉత్పత్తికై ప్రోత్సహించాలి. పునాది స్థాయి ఇన్నోవేషన్లను వీరు తయారు చేసి రైతులకు అందించాలి. ప్రాంతీయ స్థాయిలో ఉత్పత్తి చేయబడినవి కాబట్టి వీటిని తక్కువ ధరకు అమ్మే అవకాశం ఉంటుంది. స్థానికంగా ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఈ విధంగా గ్రామీణ ప్రజలు తమ అవసరాలకై వెచ్చించే ధనం ఆ ప్రాంతంలోని వారికే చెందుతుంది. ప్రస్తుతం అలా జరగటం లేదు. ఏదేశం వాళ్ళో తయారు చేసిన వస్తువులను గ్రామీణ ప్రజలు కొనడంతో వీరి ధనమంతా ప్రాంతీయ ప్రజలకు చేరడం లేదు. గ్రామాల్లోని యువశక్తిని మనం ఈ విధంగా సద్వినియోగం చేస్తే బీదరికం తగ్గే అవకాశముంది. అంచెలంచెలుగా స్థానిక వనరులు, స్థానిక వినియోగదారులు, స్థానిక ఉత్పత్తి సంస్థలు - వీటి సంధానంతో ఆ ప్రాంతంలో వెచ్చించే ధనం అక్కడే తిరిగి పదిమందికి చేరుతుంది. సుస్థిర సమాజం, సమృద్ధి సాధించటానికి ఇదో మంచి ప్రత్యామ్నాయం.

మనం రోజూ చేసే ఖర్చులో ఎంత భాగం మన పరిసర ప్రజలలో ఉండే ఉత్పత్తిదారులకు చేరుతుంది? దీన్ని మనం పరిశీలిస్తే జవాబు అంత సంతృప్తిగా ఉండదు. కనీసం 50% మనం చేసే ఖర్చు 100 కి.మీ. లోపు చేస్తున్న ఉత్పత్తులకై వెచ్చించాలి. అలా మనం అతి జాగ్రత్తగా ఆలోచించి వ్యయం చేస్తే స్థానిక ఉత్పత్తిదారులకు ప్రోత్సాహాన్ని, లాభాలను ఇచ్చే అవకాశం ఉంటుంది.

ప్రపంచీకరణలో స్థానిక అవసరాలను స్థానీయులను మరచిపోతున్నామేమో. ఇంట గెలిచి, రచ్చ గెలవాలన్న సామెతను మనం అమలులో పెడితే సమాజంలో పెరుగుతున్న ధనవంతులు - బీదవాళ్ళ మధ్య ఉన్న అగాధాన్ని తగ్గించవచ్చు అని మేం విశ్వసిస్తాం.


ఈ ఆలోచనా పద్ధతిపై పాఠకుల అభిప్రాయాలను స్వాగతిస్తాం. 'పల్లెసృజన'లో ఈ చర్చను ప్రచురిస్తాం.

మరెంతోమంది తెలుగు ఇన్నోవేటర్లను వెలుగులోకి తెచ్చే అవకాశం 2011 సంవత్సరంలో లభిస్తుందని ఆశిస్తూ.....

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

National Innovation Foundation
(NIF)



## సృజనాత్మకత, పరస్పర అవగాహన కలిసి పనిచేసే తత్వం కలభారతదేశానికై కృషి చేస్తున్న

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్

తేనెటీగ పుష్పాలనుంచి తేనెతో పాటు పుప్పొడిని సేకరించే ప్రక్రియలో ఒక పువ్వును మరో పువ్వుతో సంపర్కం కలుగజేస్తుంది. అదేవిధంగా 'హనీబీ నెట్‌వర్క్' మనుష్యులమధ్య సంబంధాలను బలోపేతం చేస్తుంది. ప్రపంచంలోని వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు ఆవిష్కరించిన అనేక నూతన కల్పనలగురించి తెలుసుకొని వాటిని ఇతరులవరకు చేరవేస్తుంది. ఇన్నోవేటర్లు, జ్ఞానాన్ని ఉత్పత్తి చేసేవారు, చేరవేసేవారు అనామకులుగా ఉండిపోకుండా, ఈ నెట్‌వర్క్ వారికొక గుర్తింపునిస్తుంది. ఇన్నోవేషన్లకి సంబంధించిన జ్ఞానాన్ని స్థానికంగా అర్థమయ్యే భాషలో అందరికీ చేరాలని, దానికై హనీబీ వార్తా లేఖలను స్థానిక భాషల్లో ప్రచురించటం వల్ల మాత్రమే సాధ్యమౌతుందని మా ప్రగాఢ విశ్వాసం. స్థానిక జ్ఞానం మరియు ఇన్నోవేషన్లపై చేసే వ్యాపారంలో వచ్చిన లాభాల్లో ఎక్కువ భాగం ఆ జ్ఞానం ఇచ్చిన ఇన్నోవేషన్లు చేసిన వారికే చెందటానికి కృషి చేస్తుంది హనీబీ నెట్‌వర్క్.

హనీబీ నెట్‌వర్క్ 20 సంవత్సరాలక్రితం కొద్దిమంది స్వచ్ఛంద కార్యకర్తలతో పని ప్రారంభించింది. వారు మన సమాజంలోవున్న క్రమబద్ధీకరించని రంగాలలోని ఏవిధమైన సహాయమూ లేని సృజనాత్మకత మరియు ఇన్నోవేటివ్ ఆలోచనలను వెతికి, వెలికి తీసి, వాటిని రక్షించే ఒక పెద్ద ఉద్యమంగా రూపుదాల్చింది. ఈ హనీబీ తత్వాన్ని ముందుకు తీసుకెళ్ళటానికై 'సైన్స్ & టెక్నాలజీ' డిపార్ట్‌మెంట్ 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.) ను 2000 సంవత్సరంలో ప్రారంభించింది. మాజీ సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్, ప్రస్తుత ఎన్.ఐ.ఎఫ్. ఛైర్మన్ అయిన డా. ఆర్.ఎ. మషేల్కర్ గారి స్ఫూర్తిదాయకమైన నాయకత్వంలో దేశంలో ఆర్థికంగా పేదవారైనా, జ్ఞానంలో పేదవారు కాని ప్రజలసేవలో ఎన్నో పెద్ద కార్యక్రమాలను చేపట్టింది ఎన్.ఐ.ఎఫ్..

ఇన్నోవేషన్లను కనిపెట్టి, గ్రంథస్థం చేసి, వాటికి అదనపు విలువ చేర్చి, సమకాలీన, ఏ సహాయమూ లేని సాంకేతిక ఇన్నోవేటర్ల, సాంప్రదాయ జ్ఞానం కలవారి మేథో సంపత్తి హక్కులను కాపాడుతూ ఆ జ్ఞానాన్ని వ్యాపార, వ్యాపారేతర పద్ధతుల్లో వాడుకలోకి తెచ్చి, భారతదేశాన్ని సృజనాత్మక, జ్ఞానసంపన్న దేశంగా తీర్చి దిద్దడానికి ఈ సంస్థ కృషి చేస్తున్నది.

ఎన్.ఐ.ఎఫ్. 5 విధులు (వెతకటం, గ్రంథస్థం చేయటం, అదనపు విలువ కల్పించటం, పరిశోధన అభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, చిన్నతరహా వ్యాపారాలు, మేథో సంపత్తి హక్కులనిర్వహణ మరియు ప్రాచుర్యం కలిగించటం, ఇన్నోవేషన్ టెక్నాలజీ) వ్యవసాయం, శక్తి, మూలికా ఔషధాలు, మెకానికల్ మొదలైన రంగాల్లో యోగ్యమైన గ్రామస్థాయిలోని టెక్నాలజీలకి సహాయ పడటానికి కలసి పనిచేస్తాయి.

దేశంలోని 547 జిల్లాలనుంచి సుమారు 1 లక్షా 40 వేలకి పైగా ఆలోచనలు, ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన పద్ధతులని ఎన్.ఐ.ఎఫ్. సేకరించి, గ్రంథస్థం చేసి వుంచింది. సి.ఎస్.ఐ.ఆర్., ఐ.సి.ఎం.ఆర్., బి.ఎస్.ఐ., ఇతర పరిశోధనా సంస్థలద్వారా ఎన్.ఐ.ఎఫ్. వాటిని ధృవీకరింపజేసి, వాటి విలువను పెంచేలా చేస్తుంది. ఎన్.ఐ.ఎఫ్.కు పేటెంట్ సంస్థలతో వున్న 'ప్రో–బోనో' అంగీకారం ఆధారంగా 230 పేటెంట్లకై (వీటిలో 7 అమెరికాలో, 1 పి.సి.టి. దరఖాస్తు) ఇన్నోవేటర్లు ఉత్తమమైన సాంప్రదాయ జ్ఞానకర్తలతరుపున దరఖాస్తు చేయటం జరిగింది. వీటిలో భారతదేశంలో 35, అమెరికాలో 5 పేటెంట్లు జారీ అయినవి. ఎన్.ఐ.ఎఫ్.లోని మైక్రో ఇన్నోవేషన్ నిధి ద్వారా 113 ప్రాజెక్టులకి రిస్క్ క్యాపిటల్ అందజేయగా, అవి వివిధ దశలలో పూర్తవుతున్నాయి. వీటికి మొత్తం 10 మిలియన్ల రూపాయలు అందజేయటం జరిగింది. 55 దేశాలనుంచి 400 వస్తువుల టెక్నాలజీల గురించి వాకబులు అందటంతో ఎన్.ఐ.ఎఫ్. 5 ఖండాలలోని దేశాలతో కూడా తన వస్తువులతో వ్యాపారం చేయటమే కాక, భాగస్వామ్య సంస్థలతో 30 టెక్నాలజీ లైసెన్సులు ఇప్పించటంలో సఫలత సాధించింది.

స్థానికంగా వున్న వనరులను జాగ్రత్తగా, తగు మోతాదులో వాడుకొని, తమ సమస్యలని పరిష్కరించుకొనటంలో ఉత్తమ ఫలితాలు సాధించటంలో భారతదేశ ఇన్నోవేటర్లు ప్రపంచంలో ఎవరికీ తీసిపోరని ఎన్.ఐ.ఎఫ్. నిరూపించింది. పేదవారు చౌక వస్తువులను వాడతారని భావించేవారు గ్రామీణ ప్రాంతాల్లోని ఆ వస్తువులు, వాటి వెనకవున్న జ్ఞానం యొక్క గొప్పతనాన్ని గుర్తించలేరు. "అట్టడుగు స్థాయిలోనుంచి ప్రపంచ స్థాయి వరకు" అని ఎన్.ఐ.ఎఫ్. అందరికీ తెలియజేస్తూ వుండటంతో అట్టడుగు స్థాయిలోని ఇన్నోవేటర్లపై ప్రపంచ దృక్పథం మారనున్నది.

హనీబీఎపి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.ఐ.ఎఫ్. కార్యకలాపాలను విస్తరిస్తోంది. బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో హనీబీఎపి గత అయిదు సంవత్సరాలలో 76 ఇన్నోవేషన్‌లను వెతికి, వెలుగులోకి తెచ్చింది. నాలుగు పేటెంట్ హక్కులను సాధించింది. ఐదు ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టడంలో విజయవంతం అయింది. 'పల్లెసృజన' ద్వైమాసిక పత్రిక సంచాలకులు బ్రిగేడియర్ గణేశం గారిని, మరిన్ని వివరాలకు ఈ క్రింది చిరునామాలలో సంప్రదించగలరు. ●

**National Innovation Foundation**
Bungalow No. 1, Satillite Complex, Prem Chand Nagar Road,
Ahmedabad - 380 015. Gujarat. E_mail : info@nifindia.org.
Phone : 079-2673 2095, 2675 3338, Fax : (079) 2673 1903

**Brig. P. Ganesham,** VSM (Retd.)
Co-ordinator, HoneybeeAP
102, Vayupuri Colony, Road No. 5, Sainikpuri Post,Secunderabad - 500 094.
E_mail : honeybeeap@gmail.com, Phone : 040-27118555, 98660 01678

# గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ను ఒక వేదికగా ఉపయోగించుకోవాలనుకుంటున్నారా?

**మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను**
**సంకోచించకుండా పంపండి.**

**ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం.**


ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది.

**మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం.**
**వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం.**

మీరంతా సహకరించి
ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను
సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

*- సంపాదకవర్గం*

# సంపూర్ణ సేంద్రియ గ్రామం 'ఎనబావి'



ప్రగతికొరకు, అభివృద్ధి అభివృద్ధి సాధనకై తీసే పరుగులో మనం ఎంత కృత్రిమమైన జీవితానికి బానిసలమై పోతున్నామో మరచిపోతున్నాం. మనం పీల్చే గాలి దగ్గరనుండి మనం తినే ఆహారము, వేసుకునే మందులు అన్నీ కృత్రిమంగా తయారైనవే. ఈరోజుల్లో రసాయనాలు వాడటం ఎంత సహజమైపోయిందంటే అది మన జీవన విధానంలో ఒక భాగమై పోయింది. ప్రత్యేకించి మనం తినే ఆహారం పండించటానికి వాడే రసాయన ఎరువులు, ప్రమాదకరమైన క్రిమి సంహారక మందులవాడకంతో పండించిన పంటలలో రుచి, రంగు, సారం లేకుండా చేయటమే కాక వాటిలో సహజ పోషక విలువలు కూడా లేకుండా పోతున్నాయి. అనేక సంవత్సరాలుగా రసాయనాలు వాడటం వలన భూమిలో సహజంగా ఉండే సారం తగ్గిపోయి, ఆ భూమి ఇంకేమీ పండించటానికి వీలు లేకుండా అయిపోయే తీవ్ర పరిణామాలు త్వరలోనే ఎదుర్కోవలసివస్తోంది. ఇలా ప్రతి గ్రామంలో, ప్రతి రాష్ట్రంలో, దేశం మొత్తంలో జరుగుతోందన్న సత్యం, పర్యవసానం ఊహించుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది.

వీటి పరిణామాలుమనందరి జీవితాలపై పనిచేస్తుందంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి పరిస్థితుల్లో గడ్డిలో బంగారు తీగలా సంపూర్ణ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయ, జీవన విధానాన్ని అనుసరించే 'ఎనబావి' గ్రామం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం మనందరికీ గర్వకారణం. గ్రామం మొత్తం, ప్రతి ఎకరా పండించే ప్రతి పంటలో కేవలం సేంద్రియ ఎరువులు, క్రిమి సంహారక మందులనే వాడతారు. ఎక్కడా రసాయన ఎరువులు కానీ, క్రిమి సంహారక మందులు కానీ వాడే మాటే లేదక్కడ. దీనితోనే అక్కడి ప్రజలు ఆర్థికంగా ఎంతో బాగుపడ్డారు. వరంగల్ జిల్లాలోని 'లింగాలఘనపూర్' పంచాయతీకి చెందిన హామ్లెట్ గ్రామం "ఎనబావి" సాధారణంగా వ్యవసాయదారులు పడే ఇక్కట్లనుండి విముక్తి చెందడానికి మార్గదర్శకం అయింది.

వరంగల్ జిల్లా మంచి వ్యవసాయానికి పెట్టింది పేరు. ఎక్కువగా వాణిజ్య పంటలు వున్నా, సరియైన పద్ధతులు, సమయానికి సహాయం అందక గత దశాబ్ద కాలంగా నిస్పృహ చెందిన రైతులు, రైతు పోరాటాలు, హర్తాళ్ళు చేస్తూ, చివరికి వారి సమస్యలు తీరటానికి




పరాకాష్టగా ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు.

ఇటువంటి జిల్లాలో ఎనబావి గ్రామం భవిష్యత్తుపై ఆశలు చూపే దివిటీగా కనిపిస్తోంది. ఈ గ్రామ ప్రజలు అచంచలమైన విశ్వాసంతో వారి వ్యవసాయాన్ని పూర్తిగా వారిచేతుల్లోకే తీసుకున్నారు. వారి భవిష్యత్తుకి వారే బాధ్యత వహించదలుచుకోవటమే కాక, దేశ రైతులభవిష్యత్తుకు కూడా మార్గదర్శకంగా నిలిచారు.

హైదరాబాద్ నుండి వరంగల్ వెళ్ళే మార్గంలో, హైదరాబాద్ నుండి 100 కి.మీ. దూరంలో జనగాం పట్టణం సమీపంలో ఉంది ఎనబావి గ్రామం. గ్రామంలోకి ప్రవేశిస్తుండగానే "కెమికల్ రహిత, జి.యం. రహిత గ్రామం" అని వెల్లడించే పెద్ద పెద్ద బోర్డులు కనిపిస్తాయి. గ్రామంలో 282 ఎకరాలసాగుభూమి, 52 కుటుంబాలు, 226 మంది జనాభా, 26 బోరు బావులు, 11 బావులు ఉన్నాయి. మొత్తం గ్రామంలోని రైతులంతా సేంద్రియ ఎరువులవాడకంలో దిట్టలు. వీరు చుట్టుప్రక్కలఇతర



గ్రామాలకి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ప్రక్రియలో "సెంటర్ ఫర్ రూరల్ ఆపరేషన్ ప్రోగ్రాం సొసైటి" (క్రాప్స్) సంస్థ 'సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ' (సి.డబ్ల్యు.యస్.), 'సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్' (సి.యస్.ఎ.) సంస్థలు చేదోడు వాదోడుగా ఉన్నాయి.




గ్రామంలో ఈ మార్పు 90వ దశక ఆరంభంలో సి.డబ్ల్యు.యస్. వారు ఎర్రగొంగళి పురుగు నివారణకై అక్కడ ప్రవేశపెట్టిన పద్ధతులతో అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. ఈ సేంద్రియ వ్యవసాయానికి ఈ సంస్థవారు గ్రామంలోని ఆదర్శ భావాలు కలిగిన రైతు 'మల్లయ్యను' ఎంచుకొని తల్లి గొంగళి పురుగు ఎంత త్వరగా సంతానోత్పత్తి చేస్తుందో వివరిస్తూ ఒక తల్లి గొంగళి పురుగును ఒక చిన్న అగ్గిపెట్టెలో పెట్టి కొన్నిరోజులు గమనించమని చెప్పారు. కొద్ది రోజుల్లోనే వందలు, వేలగుడ్లు





పెట్టగా అవి చిన్న చిన్న పురుగులుగా రూపాంతరం చెందాయి. దీంతో గ్రామస్తులకు కనువిప్పు కలిగింది. వారు సామూహికంగా వారే తయారు చేసుకున్న 'దీపపు ఎరలను' రాత్రివేళ పొలాల్లో ఏర్పాటు చేసి హానికర క్రిములను, పురుగులను నాశనం చేశారు. క్రమంగా అది క్రిమి సంహార రహిత వ్యవసాయ పద్ధతి (ఎన్.పి.యం.)కి దారి తీసింది. ఈ పద్ధతి తర్వాత కొందరు రైతులు వారు మామూలుగా వాడే రసాయన ఎరువులస్థానంలో సేంద్రియ ఎరువులవాడకం పద్ధతిని చేపట్టారు. ఇదంతా వీరు 'క్రాప్స్, సి.డబ్ల్యు.యస్., సి.యస్.ఎ.' వారి సూచనలఆధారంగా చేశారు. ముఖ్యంగా 'సి.యస్.ఎ.' సంస్థకు చెందిన డా. రామాంజనేయులు గారు, 'క్రాప్స్' సంస్థ సి.ఇ.ఓ. లింగయ్య గారు సి.డబ్ల్యు.యస్.కి చెందిన ఎన్.కె. ఖయ్యూమ్ గారు, క్రీడా సంస్థకు చెందిన సంఘీ గారు వీరికెంతో సహాయ పడ్డారు, ఇంకా పడుతున్నారు. ఆ తర్వాత ప్రక్కనేవున్న చెరువు పూడిక



తీసి సారవంతమైన మట్టిని తమ పొలాల్లో చల్లారు. పంట దిగుబడి పెరగటం ప్రారంభించింది. తర్వాత కోడిరెట్ట ఎరువు, వర్మి కంపోస్టు, పంటలోని చెత్త, చెదారంతో స్వంతంగా సేంద్రియ ఎరువులు తయారు చేసి వాడటం ప్రారంభించారు. దానితో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రతి రైతు తన పొలందగ్గర తనే స్వంతంగా వర్మి కంపోస్టు గుంటలు, ఇతర విధంగా చెత్త చెదారంతో ఎరువును తయారు చేసుకునే పద్ధతులను ఏర్పాటు చేసుకున్నారు. వీరు మిత్ర పురుగులు – పక్షులు, శత్రుపురుగులు–పక్షులగురించి క్షుణ్ణంగా తెలుసుకొని తదనుగుణంగా నివారణోపాయాలను అమలు చేసుకున్నారు. ఆ తర్వాత వారే స్వయంగా తయారు చేసుకున్న విత్తనాలు (ప్రత్తి మినహా) వాడకం ప్రారంభించారు. దానితో పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గిపోయాయి. గ్రామంలో పురుషులు, స్త్రీలు వేరువేరుగా స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి పొదుపు పాటిస్తున్నారు.

2003కి ముందు 'ఎనబావి' గ్రామంలో రెండు రకాలవ్యవసాయ దారులుండేవారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడేవారు, కేవలం సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించేవారు. వారి ఫలసాయం దాదాపు సమంగానే వున్నా, సేంద్రియ వ్యవసాయ పద్ధతి పాటించే రైతులఆదాయం రసాయనిక, క్రిమి సంహారక మందులవాడేవారికన్నా కొన్నివేలరూపాయలు అధికంగా ఉండటం చూసి క్రమేణా అందరూ ఈ సేంద్రియ పద్ధతినే అవలంభించటం ప్రారంభించారు. ఉదా. ఈ క్రింది పట్టిక చూస్తే తెలుస్తుంది.

| | కల్లెం గ్రామంలో జిల్లెలఎల్లారెడ్డి (రసాయనిక సేద్యం) | ఎనబావి గ్రామం పొన్నం మల్లయ్య (సేంద్రియ సేద్యం) |
|---|---|---|
| ఎకరం ప్రత్తి పంట పెట్టుబడి | రూ. 15,250/- | రూ. 8,550/- |
| దిగుబడి | 12 క్వింటాళ్ళు | 10 క్వింటాళ్ళు |
| ఆదాయం | రూ. 24,600/- | రూ. 22,000/- |
| నికర లాభం | రూ. 9,350/- | రూ. 13,450/- |

❀ "ఇప్పుడు గ్రామంలో మేము పొలానికి హాని చేసే చీడ పురుగులు లేనందున సేంద్రియ క్రిమి సంహారక మందులు కూడా పిచికారి చేయటం లేదు" అని చెప్పారు 60 సంవత్సరాల పొన్నం మల్లయ్య గారు. ఈయన తన 8 ఎకరాల్లో ధాన్యం, కందలు, నువ్వులు, పొగాకు, కూరగాయలు పండిస్తున్నారు.



❀ "మేం మొదటి రెండు సంవత్సరాలు మాత్రమే క్రిమి సంహారక మందులు వాడాం. ఇప్పుడు చీడలు లేవు కనుక అవికూడా వాడటం లేదు" అన్నారు మల్లయ్య గారి చెల్లెలు నర్సమ్మ. తొలుత మేము వాడిన యూరియా కూడా ఇప్పుడు వాడటం మానేశాం. యూరియా వలన పంట ఏపుగా సారవంతంగా పెరగటంతో చీడ పురుగులు చేరుతాయి. ఈ సేంద్రియ పద్ధతి వలన మిత్ర పురుగులు, శత్రు పురుగుల గురించి తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరిస్తున్నాం అన్నారామె.

❀ ఎత్తిబోయిన మహేందర్ ఈ విధంగా అన్నారు "మేము ఆవుపేడ, ఆవు మూత్రం, వర్మి కంపోస్టుతో చేసిన ప్రకృతిసిద్ధమైన ఎరువునే వాడతాము. ఆవుపేడ అవసరం పెరగటంతో మేము యంత్రాలు వాడటం మానేసి పశువులతోనే సేద్యం చేస్తున్నాము. దానికై ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఆవులతో పాటు ఇతర పశువులను కూడా పెంచుకుంటున్నాము. ట్రాక్టరుతో దున్నటానికి సుమారు రూ. 2,000/-లు ఖర్చవుతుంది. అదే పశువులతో అయితే కేవలం రూ. 1,000/-లతో సరిపెట్టుకుని వెయ్యి రూపాయలు మిగిల్చుకోవచ్చు కూడా. పైగా పాలు, మూత్రం, పేడ అదనపు ఆదాయాన్నిస్తాయి".

❀ ఈ గ్రామంలో 'శ్రీవరి' సాగును భారీయెత్తున చేపట్టటంతో పాటు శ్రీవరి సాగులో వినియోగించే 'కల్టివేటర్, మార్కర్' లాంటి పరికరాలను కూడా వారే తయారు చేసుకుని వినియోగిస్తున్నారు.



❀ "యూరియా స్థానంలో 'అజోలా' చెట్ల ఆకులని వాడతాము. అది త్వరగా పెరిగిపోయి హానికర మొక్కలను నాశనం చేస్తుంది. ఆవు పేడ, మూత్రం, పాలు, నెయ్యి, పెరుగు కలిపిన 'పంచగవ్య'ను తయారు చేసి వాడితే చేను ఆరోగ్యంగా పెరుగుతుంది. దానివల్ల పళ్ళు, కాయగూరల్లో రుచి, రంగు, పోషక విలువలు మెరుగు పడతాయి" అన్నారు ఆదర్శ రైతు, పంచాయతీ సర్పంచు పొన్నం మల్లయ్య గారు. ఈయన స్వంతంగా చుట్టుప్రక్కల గ్రామాల్లోని పిల్లలకోసం ఒక పాఠశాలతెరిచి, ఉచితంగా విద్యనందిస్తున్నారు. వీరు స్వామి రాందేవ్ గారి ఆహ్వానంపై వారి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ తమ ఊళ్లో జరిగే సస్యవిప్లవం గురించి తెలియజేసి పలు ప్రశంసలు అందుకోవటమే కాక, స్వామీజీ వీరి ఊరికి ఒక లక్ష రూపాయలవిరాళం ప్రకటించారు కూడా. వీరు



తీరికవేళల్లో కళాశాలలు, విశ్వ విద్యాలయాలకు వెళ్ళి అక్కడి విద్యార్థులకు సేంద్రియ సస్యరక్షణ, పర్యావరణ పరిరక్షణ గురించి తెలియజేస్తూ భావి తరాలకి మనం ఇవ్వగలిగిన పెద్ద ఆస్తి. సస్యశ్యామలమైన దేశంతో పాటు సారం పుష్కలంగా వున్న భూమి అని ఉపన్యసిస్తూవుంటారు.

గ్రామంలోని రైతులు 'సెర్ప్' అధికారులు చేసిన సూచన మేరకు తమ పొలాల్లో ప్రతి మూడు మీటర్లకు ఒక అడుగు వెడల్పున ఒక కందకంలాగా త్రవ్వి వదిలేస్తారు. దీంతో మొక్కలకి తగ్గ గాలి, వెలుతురు తగలటమే కాకుండా, పాములు, పందికొక్కులు ఈ కందకం గుండానే ప్రయాణించి, పంటలకు ఎక్కువ హాని చెయ్యవు. ఈ ప్రక్రియ ద్వారా వారు ఎకరానికి దాదాపు రూ. 5 వేలు అధిక ఆదాయాన్ని పొందగలుగుతున్నారు.

వీరు మంచి విత్తనాలకి కూడా తమలో తాము పరస్పర సహాయానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మంచి విత్తనానికి పనికి వచ్చే పంట పండించిన రైతును తన పంటను బైట అమ్మవద్దని, అతనికి ఎక్కువ ధర ఇచ్చి గ్రామస్తులే ఆ పంటను విత్తనానికై కొనుగోలు చేస్తారు. ఒక రైతుకి క్వింటాలుకు రూ. 900 వస్తే, మంచి విత్తనం రకం ధాన్యానికి వీరే క్వింటాలుకి రూ. 1,200 ఇచ్చి కొనుగోలు చేస్తారు. ఇదే వీరు బైట కొనుగోలు చేస్తే దాదాపు రూ. 2 వేలవరకు చెల్లించాల్సి వస్తుంది. ఈ విధంగా కూడా మేము అధిక ఆదాయాన్ని పొందగలుగుతున్నామన్నారు నర్సయ్య గారు.

"క్రాప్స్" సంస్థ ఒక లాభాపేక్ష లేని సంస్థ. దీని కార్యదర్శి లింగయ్య గారు ఈ గ్రామానికి ఎనలేని సేవలందిస్తున్నారు. వీరి కృషి ఫలితంగానే చుట్టుప్రక్కలగ్రామాలనుంచి కూడా వచ్చి 'ఎనబావి' గ్రామ సరుకులను కొనుగోలు చేస్తున్నారు రైతులు. మేము ఇంకా రసాయన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వుండివుంటే మేము చేసిన అప్పులు తీర్చగలిగేవాళ్ళం కాదు అంటున్నారు గ్రామస్తులు.

మేము మా విత్తనాలను, క్రిమి సంహారక మందులు, పంచగవ్య, వావిలాకు కషాయము మొదలైనవి మేమే తయారు చేసుకుంటున్నాము. మా భూమిని వర్మి కంపోస్టు, సేంద్రియ ఎరువులు, చెరువు పూడిక మన్నుతో సారవంతం చేసుకుంటూ అధిక లాభాలను ఆర్జిస్తున్నాము. మాకు చేతినిండా పని వుండటంతో వేరే వ్యాపకాలు లేవు. ఇళ్ళల్లో చిన్నా, చితకా, ముసలి, ముతక అంతా ఇదేపనిమీద ఉంటాము. ఒక చేతినిండా పని, మరో చేతినిండా ఆదాయం. మాకు వేరే ధ్యాస లేదు అంటున్నారు గ్రామస్తులు. మా కరెంటుకై డిపార్ట్‌మెంటు వారే కాక, పొలాల్లో మోటార్లకి మేమే కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటున్నాము. నీరు అందరం సమానంగా పంచుకుంటున్నాము. ఖర్చు సమానంగా భరిస్తాం అంటారు వారు.

ఇప్పుడీ గ్రామం ఆ దారివెంట పోతున్న వారందరికీ తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశంగా మారిపోయింది. అటుగా వెళ్ళే లాభాపేక్షలేని సంస్థలు, సంఘ సంస్కర్తలు, మంత్రులు, ప్రణాళికా సంఘ సభ్యులు, అంతర్జాతీయ







సంస్థలకి చెందిన వ్యక్తులు ఈ గ్రామాన్ని దర్శించి ఇక్కడ జరిగే సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసి, అడిగి మరీ తెలుసుకుంటున్నారు. 'పూసా' ఇన్‌స్టిట్యూట్‌లో 2003లో జరిగిన 'ఇండియన్ ఆర్గానిక్ ట్రేడ్ ఫేర్' లో ఎనబావి గ్రామంలో పండించిన బియ్యం ప్యాకెట్లు క్షణాలమీద అమ్ముడు పోవటంతో ఈ గ్రామం పేరు ఢిల్లీదాకా పాకింది. సి.యస్.ఎ. సంస్థ వారు సేంద్రియ ఉత్పత్తులను 'సహజ ఆహారం' పేరున హైదరాబాద్ తార్నాక ప్రాంతంలో ఒక దుకాణం ద్వారా విక్రయిస్తున్నారు. అందులో అధిక భాగం 'ఎనబావి' గ్రామ ఉత్పత్తులే కాకవటం ముదావహం.

ఈ గ్రామాన్ని మీ 'పల్లెసృజన'కి పరిచయం చేసి, తీసుకువెళ్ళి చూపినవారు రిటైర్డు నాబార్డు అధికారి, హనీబీ వాలంటీర్ శ్రీ జె. శ్రీకర్ గారు. 'పల్లెసృజన' బృందం ఈ గ్రామాన్ని దర్శించినపుడు అక్కడ వారు తిన్న పళ్ళు, భోజనం రుచులలో సేంద్రియ ఎరువులవాడకపు ఫలితాన్ని



ప్రత్యక్షంగా ఆస్వాదించగలిగారు. ఈ పర్యటనలో 'క్రాప్స్' సంస్థ చేపట్టిన చుట్టుప్రక్కలగ్రామాలనీటి పరీక్షా ఫలితాలప్రకారం ఈ గ్రామంలో నీటి మట్టం అధికంగా ఉండటంతో పాటు, ఆ నీటిలో హానికర రసాయనాలు కూడా ఏమీ లేవని నిరూపించే పత్రాలు ఆరోజే అందటంతో వీరు చేస్తున్న కృషికి తగిన ఫలితం వస్తోందని తెలుసుకోటం ఎంతో ఆనందానికి గురి చేసింది.

రైతులు క్రమంగా రసాయనిక వ్యవసాయ పద్ధతులను విడనాడి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే వారికి మంచి ఆదాయం రావటమే కాక, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ తరానికి అందించిన వారవుతారు. సమాజ ఆరోగ్యాన్ని (తద్వారా అభ్యుదయాన్ని) కాపాడిన వారవటం ఒక ఎత్తయితే, భావితరాలకి యోగ్యమైన పద్ధతిని ప్రవేశ పెట్టిన వారవటమే కాక, మంచి సారవంతమైన భూమి, కలుషితం కాని పర్యావరణం, కృత్రిమ జీవితాలనుంచి కాపాడటం మరోయెత్తు.ఇది మనం భావితరాలకిచ్చే అన్ని ఆస్తులకన్నా ఎన్నోరెట్లు విలువైంది కదా!

**మీ గ్రామాన్ని కూడా ఇలా మార్చుకోవాలి అనుకుంటున్నారా? అయితే వెంటనే 'పల్లెసృజన'ను సంప్రదించండి. సంబంధిత స్వచ్ఛంద సంస్థలను మీ గ్రామం దర్శించి కార్యక్రమాలు చేపట్టడానికి మావంతు కృషి చేస్తాం. స్వచ్ఛమైన వాతావరణాన్ని తయారు చేసుకుందాం.భావి తరాలు ఆరోగ్యవాతావరణం, సుస్థిర సమాజంలో జీవించే అవకాశానికి అందరం కృషి చేద్దాం. - ఎడిటర్**

## యం.ఐ.టి. (అమెరికా) వారికి స్ఫూర్తినిచ్చిన

# భారతదేశ గ్రామీణవాసి ఆలోచన



"భారతదేశ ఆత్మ గ్రామాల్లో నివసిస్తున్నది" అన్నారు మహాత్మాగాంధీ. ఇప్పుడు గౌహతిలోని ఒక గ్రామవాసి అది నిజమేనని రుజువు చేసి ప్రపంచాన్నే ఒప్పించాడు. అస్సాం రాష్ట్రంలోని గౌహతి సమీపంలోగల ఒక మారుమూలపల్లెలో నివసించే 29 సంవత్సరాల 'కనక్‌దాస్' తన సైకిలు గతుకులు, గుంతలలోంచి వెళ్ళినప్పుడు ఉత్పన్నమయ్యే అదుపులవల్ల జనించిన శక్తితో సైకిల్‌ని ముందుకు నడిపించే పద్ధతి కనుగొన్నాడు. దానివలన సైకిల్ ఒక గుంతలో పడి లేచిన తర్వాత సైకిల్ తొక్కనవసరం లేకుండానే కొన్ని మీటర్లు ప్రయాణం చేస్తుంది.

ఈ విషయం అమెరికాలోని కేంబ్రిడ్జిలో 'మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (యం.ఐ.టి.) వారి దృష్టికి తీసుకువెళ్ళగా ఎట్టకేలకు వారీ ఆలోచనను ఇంకా పరిశీలించటానికి పూనుకున్నారు. మార్గంలో గతుకులకారణంగా వాహనంలోని షాక్ అబ్జార్వర్లు ఉత్పన్నం చేసే శక్తితో వాహనాన్ని ముందుకు ఉరికించటానికి వీలవుతుందని, దానిపై తదుపరి ప్రయోగాలు చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు.

అహమ్మదాబాద్ లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీ అనిల్ గుప్తా గారు ఈ ఆలోచనని యం.ఐ.టి. వారి దృష్టికి తీసుకెళ్ళారు. కనక్‌దాస్ తన గ్రామంలోని గతుకులరోడ్లనుంచి విముక్తికై ఈ కల్పన చేశాడు. ప్రపంచ ఉత్పత్తి టెక్నాలజీలో ఇదొక నూతన విప్లవాన్ని సృష్టించే అవకాశం వుంది కనుక దానిని యం.ఐ.టి. వారు వెంటనే తదుపరి పరిశోధనలకై స్వీకరించారు.

నెల్లూరులోని నాయుడుపేటలో గల'నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్' సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్ గారు ఈ వార్త విని ఈ విధంగా ప్రతిస్పందించారు. "గ్రామాల్లో మేధావులెంతోమంది ఉన్నారు. వారి ఆలోచనలను గుర్తించి, వారిలోని సృజనాత్మకత వికసించటానికి ఎన్జీవోలు, శాస్త్రీయ సంఘాలు, ప్రభుత్వం పాటుపడాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా వుంది. మనం గ్రామాల్లో తయారైంది అంటే మంచిది కాదని, పట్నందైతే మెరుగైందని, అదే విదేశాలలోనిదైతే ఉత్తమమని అనుకుంటూ వుంటారు. ఇది ఎల్లవేళలా నిజం కాదు. చైనానుంచి చవకగా చేతి గడియారాలు వస్తున్నా, మన టైటాన్ గడియారాలు ప్రాచుర్యం పొందటం లేదూ! నేను భారతదేవంలో తయారైన 8 సి.ఎఫ్.ఎల్. బల్బులని కొనుగోలు చేశాను. అవి గత 8 సంవత్సరాలనుంచి భేషుగ్గా పనిచేస్తూనే వున్నాయి. దాని ఖర్చులో మూడవ వంతుకే చైనాలో తయారైన సరుకు ఒక యేడాది కూడా రావటం లేదు.

నేను చెప్పున్నట్లు 1980లలో అప్పటి డి.ఎన్.ఇ.ఎస్. వారు (ఇప్పుడది ఎం.ఎన్.ఆర్.ఇ. అయ్యింది) 50 విండ్ ఛార్జర్లు చాలా ఖరీదు పెట్టి దిగుమతి

చేసుకున్నారు. అవేవీ యేడాదికి మించి పనిచేయలేదు. మరోవేపు ఒక నిరక్షరాస్యుడు (ఏమీ తెలియనివాడు మాత్రం కాదు!) ఈతచెట్టును స్థంభంగా చేసి, చెక్కతో రెండు రెక్కలు తయారు చేసి కారు జనరేటర్ వైండింగ్‌లో కొద్దిపాటి మార్పులు చేసి, వాటిద్వారా ఒక రిఫ్రిజిరేటరు, రేడియో, ఒక ట్యూబ్‌లైట్‌కు అవసరమైన విద్యుత్తు ఉత్పత్తి చేసి చూపాడు. ఆ పరికరం గత 20 సంవత్సరాలనుంచి నిరంతరాయ మానంగా పనిచేస్తూనే వుంది. తమిళనాడులోని రామేశ్వరం ప్రాంతంలో గల'మంటపం' గ్రామంలో వున్న ఈ ఆవిష్కరణని చూసి దీనిని సృష్టించిన మేధావి శక్తికి జోహార్లర్పించాను.

పల్లె సమస్యలకి అన్ని సమాధానాలు ఎం.ఐ.టి. నుంచే రానవసరం లేదు. ఎందుకంటే సాంకేతికత అన్నది సంస్కృతికి సంబంధించినది.

ఐ.ఐ.సి.యస్., ఐ.ఐ.టి.లు మొదలైన వాటిలో మంచి ఆలోచనాపరులున్నారు. కావలసిందేమిటంటే సమాజానికి, తద్వారా దేశానికి సేవ చేయాలన్న దృఢ సంకల్పం. గత మూడు దశబ్దాలనుండి నేను రెన్యువబుల్ ఎనర్జీకి సరిపడే టెక్నాలజీ, బయో టెక్నాలజీ మొదలైన వాటికి సంబంధించిన 30కి పైగా వస్తువులకు రూపకల్పన చేసి, ప్రదర్శించి, నలుగురికీ తెలియజేయాలనే ప్రయత్నం చేస్తున్నాను. వీటిలో కొన్ని ఆఫ్రికా దేశాలలో బహు ప్రాచుర్యం పొందివున్నాయి. ప్రచార సాధనాలతో సంబంధమున్న 'సిలికాన్ ఇండయా' రెడిఫ్ న్యూస్, ది వీక్, ఇండియా టుడే మొదలైన వారు ఈ గ్రామీణ ఇన్నోవేషన్లపై దృష్టి సారించి, వాటిని వ్యాపారానికి ఉపయోగపడేలా ఆర్థిక సహాయం ఇప్పించటానికి వెలుగులోకి తీసుకు రావాలి.

లెక్కలేనన్ని ఆలోచనలు వస్తూ వుంటాయి. గాలి మరలనుండి స్పిన్నింగ్ వీల్ వరకు వందలకొద్ది డిజైన్లు అందుబాటులో వున్నాయి. ఈ మధ్యస్థ జ్ఞానాన్ని (సరియైన పేరు కాదేమో) ఏం చేయాలి? ఎందుకు చేయాలి? ఏం చేయవచ్చును? ఈ జ్ఞానం ఏ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో మార్పును తీసుకు రాగలదు అని ఎన్నో పేపర్లలో రాస్తున్నారు, నలుగురూ చర్చిస్తున్నారు. అనుభవజ్ఞులైన నిష్ణాతులనీ పిలిపిస్తున్నారు.

కానీ, ఈ చర్చలన్నింటిలో కూడా రైతులు, గ్రామీణ కళాకారులఆలోచనలకు స్థానం ఉన్నట్లు కన్పించటం లేదు. అయితే అందరూ గ్రామీణ ప్రాంతాలఆర్థిక, సాంఘిక పునరుజ్జీవనానికి ఈ టెక్నాలజీ మార్పిడి అవసరం అన్న ఆలోచన మాత్రం చేస్తున్నారు. అయినా గ్రామీణ జనాభాకి మాత్రం బైటనుంచి ఎటువంటి సహాయమూ, ఆలోచనలు, వస్తువులు లేకుండానే జీవించగలుగుతున్నారు. వారు వారివారి ప్రాంతాలకి అనువుగా వుండే తక్కువ ఖర్చుతో వారికవసరమైన వస్తువులు తయారు చేసుకో గలుగుతున్నారు. గ్రామీణులు, కళకారులు వాడే పద్ధతులు, కల్పనలని చిన్నచూపు చూస్తే మాత్రం చాలా పిచ్చితనమౌతుంది. పొలంలో ఒక నాగలి చెడిపోయినప్పుడు మార్కెట్‌లో వెళుతున్నపుడు వారి ఎడ్లబండికి ఏదైనా మరమ్మత్తు వచ్చినపుడు తుఫాన్‌లో వారి ఇళ్ళు కూలిపోయినప్పుడు వారు పరిసర ప్రాంతాల్లో అందుబాటు లోనున్న వస్తువులతో, పరికరాలతో వారి సమస్యని అధిగమించగలుగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి సాధించాలంటే ఆ ప్రాంత ప్రజలసమస్యలను శాస్త్రవేత్తలు ఒక సవాలుగా స్వీకరించి, వాటికి పరిష్కార మార్గాలు కనిపెట్టాలి. నిజమే, శాస్త్రవేత్తలు, గ్రామీణులు సమస్యని ఒకేలాగా చూడరు. వారి దృక్పథాలు వేరై ఉండవచ్చు. గ్రామీణులు సూచించిన పరిష్కారాలు శాస్త్రవేత్తలు అంగీకరించక పోవచ్చు. అదేవిధంగా శాస్త్రవేత్తలు సూచించిన పరిష్కారాలు గ్రామీణులకి అర్థం లేనివిగా అనిపించవచ్చు. ప్రాజెక్టులు గ్రామీణులపై బలవంతాన రుద్దితే వారు దానికి సహకరించక, తిరస్కరించే అవకాశమూ వుంది. గ్రామీణ అభ్యుదయ పథకాలలో మౌలికంగా ముందు సామాజికంగా వారికి చేరువగా వెళ్ళాలి. తరువాత శాస్త్రీయ, మనో విజ్ఞాన ప్రాతిపథికన వారికి నచ్చచెప్పాలి.

"ఎంతైనా దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుషులోయ్" కదా!

అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ వై. నాయుడమ్మగారు చెప్పినట్లు మన నినాదం పరంపరాగతంగా వచ్చే జ్ఞానానికి కొత్తదనం అద్దాలి. కొత్త తరం విజ్ఞానాన్ని పరంపరాగత విజ్ఞానంతో మేళవించాలి. ●



# వరంగల్ జిల్లాలో సేకరించిన సాంప్రదాయ జ్ఞానం

సేకరణ : **ముప్పారపు రాజు, హనీబీ స్కాట్**



**కె. బిక్షపతి, దుగ్గొండి గ్రా. & మం.:**

**మతిమరుపు తగ్గేందుకు :** దాల్చిన చెక్కను ప్రతిరోజు ఉదయం కొద్దిగా తింటే జ్ఞాపక శక్తి పెరుగుతుంది.

**పిప్పి పళ్ళు తగ్గేందుకు :** ఉత్తరేణి ఆకులరసాన్ని 6 మి.లీ. తీసుకుని చెవిలో వేస్తే పంటిలోని క్రిమి నశించి, పిప్పి పళ్ళ బాధ తగ్గుతుంది.

**పేను కొరుకుట తగ్గటానికి :** గంటగలగర ఆకుని మెత్తగా నూరి సీసాలో భద్రపరచుకోవాలి. తరువాత దాన్ని తలపైన లేపనం వలె రాయాలి. ఇలా రోజుకు రెండుసార్లు ఉదయం, సాయంకాలం చేస్తే పేను కొరుకుడు తగ్గిపోతుంది.



**వైనాలఉప్పలయ్య, మహమ్మదాపురం గ్రా., దుగ్గొండి మం.:**

**కాలి మడిమలకు వచ్చే గుర్రం ముడతలనివారణకు :**

కొంతమంది వ్యక్తులకు కాలి మెడిమలవద్ద గుర్రం ముతులు అనే వ్యాధి వస్తుంది. వాటి నివారణకు గుర్రపుడెక్క ఆకులను తీసుకుని బాగా దంచి, ఒక ముద్దలాగా తయారు చేసుకొని కాలి మడిమలకు గుడ్డతో కట్టుకోవాలి. ప్రతిరోజూ రాత్రి ఇలా చేస్తే కాలి మడమలకు వచ్చే గుర్రం మూతులవ్యాధి త్వరగా తగ్గిపోతుంది.

**విరిగిన ఎముకలు అతుక్కోవడానికి :**

విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి అడవి చెన్నంగి ఆకుల్ని బాగా దంచి వాటి రసాన్ని తీసుకుని విరిగిన ఎముకలవద్ద చర్మంపై రాసి గుడ్డతో గట్టిగా కట్టు కట్టాలి. ఇలా చేస్తే ఎముకలు త్వరగా అతుక్కుంటాయి.

**యల్. నారాయణ, రంగాపురం గ్రా., నల్లబెల్లి మం.:**

**గొంతునొప్పి తగ్గించే ఔషధం :**

గొంతులో నొప్పిగా వుంటే త్వరగా తగ్గటానికి తెల్ల బుడ్డగగే చెట్టు ఆకుల్ని తెంపి బాగా నూరి వచ్చిన మిశ్రమాన్ని గొంతుపై పట్టికగా వేసుకోవాలి. ఇలా మూడురోజులు చేస్తే గొంతునొప్పి తగ్గిపోతుంది.

**బాంగురు లక్ష్మణ్, ఆర్మ గ్రా., డుంబిగూడ మం., విశాఖపట్నం జిల్లా :**

**కామెర్లకు ఔషధం :**



పచ్చకామెర్లు వచ్చినవారు 'కురమల్' మరియు 'దేవ్ బద్నె' ఆకులని కొద్దిగా నీరు పోసి నున్నగా నూరి కషాయం లాగా తయారు చేసుకుని రోజూ ఉదయం సాయంత్రం ఒక టీస్పూను కషాయాన్ని మూడు రోజులపాటు త్రాగితే కామెర్లు త్వరగా తగ్గిపోతాయి.

**అజీర్తి వ్యాధికి మందు :**



అన్నం తిన్న తర్వాత అరగకపోతే 'రజకస్తూరి' మరియు 'కూసంబి' లను కొద్దిగా నీటిలో నూరి కషాయం వలె తయారు చేసుకుని చిన్న గ్లాసు నీటిలో సగం మందు కలిపి తాగించాలి. రోజుకు మూడు పూటలా ఈ కషాయం త్రాగితే అజీర్తి వ్యాధి తగ్గిపోతుంది.


**గొల్లోరి ధనురాజ్, తోటవలస గ్రా., డుంబ్రిగూడ మం. :**

**చలి జ్వరం నివారణకు ఔషధం :**

'నందిదల్' ఆకులను నున్నగా నూరి ఆరబెట్టి, గుళికలుగా తయారు చేసుకుని రోజూ ఉదయం టిఫన్,

సాయంకాలం భోజనం తర్వాత ఒక్కో మాత్ర మింగితే చలిజ్వరం తగ్గుతుంది.

**గుండెనొప్పికి ఔషధం :**



'బోడీ జడమ' ఆకులను తీసుకుని మెత్తగా నూరి మాత్రలుగా తయారు చేసుకోవాలి. ప్రతిరోజూ మూడు పూటలా ఒక్కో మాత్ర చొప్పున వేసుకుంటే గుండెనొప్పి తగ్గుతుంది.

**దగ్గుకు ఔషధం :**




'సేలి అంక్కి గోస్' మరియు 'దుంబ్జ జడ్డ' ఆకులను మెత్తగా నూరి వేడి చేసి కషాయం తయారు చేసుకోవాలి. ప్రతిరోజూ మూడు పూటలా అన్నం తిన్న తర్వాత త్రాపితే దగ్గు తగ్గుముఖం పడుతుంది.

**కడుపునొప్పి, విషజ్వరం వచ్చినపుడు :**

నొందోల్ బెరదు, ఆకులను నున్నగా నూరి కషాయం తయారు చేసుకుని మూడు పూటలా ఒక గ్లాసు నీటిలో రెండు టీస్పూన్ల కషాయం కలుపుకుని త్రాగితే కడుపునొప్పి వున్నవారికి, విషజ్వరం ఉన్నవారికి ఉపశమనం కలుగుతుంది.

**మానసిక రోగులకు (పిచ్చి) ఔషధం :**



మానసిక రోగంతో (పిచ్చి) బాధపడుతున్నవారికి 'కోసోమ్' మరియు 'దుబ్‌జుడ్' మొక్కలఆకులను తీసుకుని నూరి పేస్టులా తయారు చేయాలి. ఈ పేస్టను గుళికలుగా చేసుకుని రోజుకు మూడు పూటలా తినిపించడం వలన మానసిక రోగం త్వరగా కుదురుకుంటుంది.

**గొంతులో తడారిపోతున్నప్పుడు :**

గొంతులో ఎక్కువగా తడి ఆరిపోతున్నప్పుడు నీలగిరి ఆకులను తీసుకుని మెత్తగా నూరి కషాయం తయారు చేసుకుని ఒక రోజుకు మూడు పూటలా తీసుకుంటే గొంతు బాగుపడుతుంది.

**కె. లక్ష్మి, మల్లంపల్లి గ్రామం, దుగ్గొండి మండలం,**

**జలుబుకు మందు :**

ముక్కులో నీరు కారుతూ, తుమ్ములు వస్తూవున్నపుడు 'రెడ్డివారి నానబాల' అనే మొక్కను తీసుకుని బాగా మరుగుతున్న నీటిలో వేసి పైకి వస్తున్న ఆవిరిని పట్టుకుంటే జలుబు తగ్గిపోతుంది.

**మధుమేహం (చక్కెర వ్యాధి) :**



తంగేడు పువ్వుల్ని బాగా దంచి కషాయం తయారు చేసుకోవాలి. తయారైన కషాయాన్ని పాలలో కలిపి రోజూ 5 మి.లీ. చొప్పున సేవిస్తే మధుమేహం అదుపులో వుంటుంది.

**పాము కాటుకు ఔషధం :**

ఉత్తరేణి గింజల్ని అరగదీసి వచ్చిన చూర్ణానికి కొద్దిగా తేనె కలిపి పాము కరిచినచోట రాస్తే పాము విషాన్ని హరించి వేస్తుంది.

**ఆర్. సోమయ్య, బ్రాహ్మణకొత్తపల్లి, వెల్లికుదురు మండలం:**

**చిగుళ్ళవాపు తగ్గించే ఔషధం :**

జామచెట్టు ఆకుల్ని నీటిలో మరిగించి వడపోసి ఆ కషాయంతో పుక్కిలించాలి. ఇలా రోజుకు ఐదుసార్లు చేస్తే చిగుళ్ళవాపు తగ్గిపోతుంది.

**అధికంగా తుమ్ములు వస్తుంటే :**

గులాబిపువ్వు రెక్కల్ని మెత్తగా నలిపి రసం తీసి దానికి కొద్దిగా నువ్వులనూనె కలిపి ముక్కులో రెండు లేదా మూడు చుక్కలు వేసుకోవాలి. రోజూ రాత్రిపూట ఇలా చేస్తే విపరీతంగా వచ్చే తుమ్ములు తగ్గిపోతాయి.

**చర్మవ్యాధికి మందు :**

జిల్లేడు చెట్టు ఆకుల్ని బాగా దంచి అందులో కొద్దిగా పసుపు కలిపి శరీరానికి రాసుకుని 20 నిమిషాలతర్వాత స్నానం చెయ్యాలి. ఇలా చేస్తే గజ్జి లాంటి చర్మ వ్యాధులు తగ్గిపోతాయి.

# ఇగ్నైట్-2011




పిల్లలలోని సృజనాత్మకతని వెలుగులోకి తీసుకు రావటానికి ఎన్.ఐ.ఎఫ్. 'ఇగ్నైట్' పేరున 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' (సి.బి.యస్.ఇ.), 'నవోదయ విద్యాసమితి' 'సొసైటీ ఫర్ రీసర్చ్ & ఇన్నోవేషన్స్ ఇన్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ & ఇన్‌స్టిట్యూషన్స్' (సృష్టి) మొదలైన ఇతర సంస్థలభాగస్వామ్యంతో పోటీలు నిర్వహిస్తున్నది. పిల్లలు తమ పాఠ్య పుస్తకాలపరిధి నుండి బయటకు వచ్చి వారిలో దాగివున్న సృజనాత్మకతని వెలుగులోనికి తీయటమే దీని ఉద్దేశ్యం. పోటీ లో పాల్గొను వారు 1-8-2011 లోగా తమ దరఖాస్తులను చేయవలసి వుంటుంది. పిల్లలలోని సృజనాత్మకత, ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే గౌరవ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి జన్మదినమైన 15-10-2011నాడు బహుమతులు అందజేయ బడుతాయి. 12వ తరగతి వరకు చదువుకున్న ఏ విద్యార్థి అయినా బడికి వెళ్తున్న వారైనా, వెళ్ళనివారైనా తమ ఇన్నోవేషన్ దరఖాస్తులను ఈ క్రింద ఇవ్వబడిన చిరునామాలకు గానీ, లేదా ఇ-మెయిల్ : ignite11@nifindia.org గాని పంపవచ్చు.



**చిరునామాలు**


**National Innovation Foundation**
Bungalow No. 1, Satillite Complex,
Prem Chand Nagar Road,
Ahmedabad - 380 015. Gujarat
E_mail : info@nifindia.org.
Phone : 079-2673 2095, 2675 3338
Fax : (079) 2673 1903

**Brig. P. Ganesham,** VSM (Retd.)
102, Vayupuri Colony, Road No. 5,
Sainikpuri Post,
Secunderabad - 500 094. A.P.
E_mail : honeybeeap@gmail.com
Phone : 040-27118555, 98660 01678

# కళాశాల విద్యార్థుల సృజనాత్మకత

**హనీబీఎపి కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారు ఆలూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్, హన్మకొండ, వరంగల్ జిల్లా సందర్శించినపుడు అక్కడి విద్యార్థులు అప్పటికప్పుడు బ్రిగేడియర్‌గారితో వెలిబుచ్చిన అభిప్రాయాలు**





ఉపాధ్యాయులు బోర్డుమీద వ్రాసి, తుడవటానికి డస్టర్‌ను వెతుక్కోవటంతో చాలా సమయం పడుతోంది. మార్కర్‌తోనే కలిసి వున్న డస్టరే కనుక ఉంటే?

**– మహేశ్వరి**

క్లాసు రూములో ప్రొఫెసర్ గారు చెప్పేది వినటము, వెంటనే వ్రాసుకోవటం కాస్త ఇబ్బందిగా వుంటుంది. ఆయన చెప్పేది ముందుగా మన పెన్నులోని వాయిస్ రాకార్డర్‌లో రికార్డు చేసేసి, మనకు తీరికున్నప్పుడు నోట్సు వ్రాసుకునే సదుపాయం ఉంటే....?!

**– ఎ. సుశీల్ కుమార్**

అద్దాలు పగలని ఇళ్ళంటూ ఉండదు. అదే పగలని అద్దం తయారు చేసేస్తే.....!

కరెంటు అంటేనే షాక్ భయం ఉంటుంది. షాకు కొట్టని ఎలక్ట్రిక్ వస్తువులను తయారు చేస్తే....?!

**– నాజియా సుల్తాన్**



మండుతున్న స్టౌమీద గిన్నె పెట్టి మరిచిపోవటం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతూ వుంటాయి. మనం స్టౌమీదనుండి గిన్నె తీసివేసిన వెంటనే స్టౌ ఆరిపోయే పద్ధతి వుంటే....?! ఇదే సదుపాయం సౌరశక్తితో పనిచేసే స్టౌకే వుంటే....? ఎన్ని లాభాలో.....!!!

**– ఎస్. అనూష**




కళ్ళజోడుకు బదులు కాంటాక్ట్ లెన్స్‌లు పెట్టుకునేవారు చాలామంది ఉన్నారు. కాకపోతే నిద్రపోయే ముందు వాటిని తీసి పడుకోవాలి. ఇలా తీసివేయనవసరం లేని కాంటాక్ట్ లెన్సెస్ ఉంటే?

**– ఎన్. సింధూర**




సేంద్రియ వ్యవసాయం పట్ల దేశమంతా మక్కువ చూపుతోంది. దీనివలన దేశంలోని ప్రజలంతా సేంద్రియంగా తయారైన ధాన్యం, కాయగూరలు, పళ్ళు తినటం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. నివారణ చికిత్సకన్నా మేలైనది కదా....! ఇలా భారతదేశ ప్రజలంతా చేస్తే ....!! ఆరోగ్యంగా ఉండటానికి భారత యోగశాస్త్రంలో చెప్పిన పద్ధతులను పాఠశాలలు, కళాశాలల్లో బోధించాలి. సుగంధ ద్రవ్య మొక్కల స్థానంలో ఆయుర్వేద మొక్కలు ఎక్కువగా పెంచాలి. ప్లాస్టిక్ స్థానంలో దూదిని వాడాలి. తక్కువ ఖర్చుతో, పర్యావరణాన్ని రక్షించే ప్రకృతిసిద్ధమైన రంగులను వాడాలి.

**– పి. జ్యోత్స్న**



మొబైల్ ఫోన్లలో రింగ్‌టోన్‌లు మోగుతునే వుంటాయి. దోమలను పారద్రోలి లేదా పూర్తిగా నిర్మూలించే రింగ్‌టోన్ కనిపెట్టగలిగితే....!


**– బి. క్రాంతికుమార్.**



మనకి మూడు తలుపులు కలిగిన రెఫ్రిజిరేటర్లు ఉన్నాయి. మొత్తం రెఫ్రిజిరేటరు కేవలం పదార్థాలను చల్లగా ఉంచటానికే కాక, పైన వున్న భాగం ఓవెన్‌లాగా డిజైన్ చేస్తే వేరే ఓవెన్ కనుక్కోవలసిన అవసరం ఉండదు కదా!

మనం తలుపులకి గొళ్ళాలు బిగించటానికి బోల్టులు, నట్లు వాడుతూ వుంటాము. వీటిని దొంగలు తేలికగా విరగొట్టే అవకాశం ఉంది. దీనికి బదులుగా గొళ్ళాలని రిమోట్‌తో కంట్రోల్ చేసే మాగ్నెట్‌ల ద్వారా బిగిస్తే.... రక్షణ ఎక్కువగా ఉంటుంది కదా....!

**– /.....**



ఇళ్ళల్లో తాగునీటిని శుద్ధి చేయటానికి వాటర్ ఫిల్టర్‌లను వాడుతూ వుంటాం. ఇదే వాటర్ ఫిల్టర్ సదుపాయం ఇంటిపైన ఉంటే ఓవర్‌హెడ్ ట్యాంకునుండి వచ్చే పైపులలో బిగించివేస్తే....?! మనకు కావలసినప్పుడల్లా శుద్ధమైన తాగునీరు సిద్ధం కదా...!

**– యస్. హరిత**



జుట్టు త్వరగా కత్తిరించటానికి ఒక ఆటోమేటిక్ జుట్టు కత్తిరించే యంత్రమే ఉంటే......!

**– బి.జి. ప్రదీప్**



రంగురంగుల దుస్తులను ధరించాలని చాలామంది కోరుకుంటారు. చిన్న బ్యాటరీ, డిస్‌ప్లే స్క్రీన్ సహాయంతో మనం కోరుకున్న రంగుకు మన దుస్తులు మారిపోయే ఉంటే.....! డ్రస్ అస్సలు రంగు మారకుండా కోరుకున్న రంగు మాత్రమే వచ్చేలా వుంటే స్కూలు, కాలేజి పిల్లలకు ఎంతబావుంటుంది....!

**– ఆర్. రామలింగేశ్వర రావు**

**ఈ అభిప్రాయాలు కళాశాల విద్యార్థుల ఆలోచనలు మాత్రమే కాదు. సమాజానికొక సవాల్. వీటిని స్వీకరించి, వీటికి పరిష్కారం సూచించదలచుకున్న వారికి హనీబీ సహకరిస్తుంది.**




## పంచపత్ర కషాయం తయారి

**కావలసినవి :**

1. వేపాకు – కిలో, 2. కానుగ – కిలో, 3. బిల్వం – కిలో, 4. విషముష్టి – అరకిలో, 5. వావిలాకు కిలో, 6. తంగేడు– కిలో, 7. సీతాఫలం ఆకులు– కిలో, 8. కుక్క తులసి (పిచ్చి తులసి)– కిలో, 9. పుదీన– అరకిలో (ఆకులు + తొడిమలు), 10. పాలకొడిన– అరకిలో, 11. కొత్తిమీర – అరకిలో (ఆకులు + తొడిమలు), 12. నేరేడు ఆకులు – కిలో, 13. నేలవేము – అరకిలో, 14. యూకలిప్టస్ (నీలగిరి) – కిలో, 15. అత్తా కోడలు ఆకు – కిలో.

**తయారు చేయు పద్ధతి :**

1. పైన చెప్పినవాటిలో ఏవైనా 5 రకాలఆకులు పైన చెప్పిన మోతాదులో తీసుకోవాలి. 2. వాటి ఆకులు విడదీసి, ఒక కుండలో వేసి 10 లీటర్ల నీరు పోయాలి. 3. ఒక రాత్రంతా అలాగే ఉంచాలి. 4. మరునాడు ఆ కుండను వేడి చేయాలి. 5. ద్రావణం సుమారు ఐదు లీటర్లు అయ్యేవరకు వేడి చేస్తూ, మధ్య మధ్యలో కర్రతో బాగా కలపాలి. 6. తర్వాత కుండను బాగా చల్లార్చాలి. 7. ద్రావణాన్ని వడపోసి, దానికి 100 గ్రా. సబ్బుపొడి కలపాలి. 8. ఈ విధంగా తయారైన ద్రావణాన్ని




100 లీటర్ల చల్లని నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారి చేయాలి.

**గమనిక :** 10 లీటర్ల ట్యాంకుకి 0.5 లీటర్ల ద్రావణాన్ని కలుపుకోవాలి. 15 లీటర్ల ట్యాంకుకి 0.75 లీటర్ల ద్రావణాన్ని కలుపుకోవాలి.

**నివారించే పురుగులు :** 1. రసం పీల్చే పురుగులు, 2. చిన్న చిన్న లార్వాలు, 3. ఆకులు తినే మిడతలు, 4. కాయ తొలిచే పురుగులు.

**ఎన్నిసార్లు వాడాలి? :** 1. ఈ ద్రావణం ఒక ఎకరాకు ఒకసారి సరిపోతుంది. 2. అన్ని పంటలలో వాడవచ్చు. 3. పురుగులతీవ్రతను బట్టి 2-3 సార్లు వాడవచ్చు (ఉదా.: మిరప, పత్తి), 4. వరిపంటలో 1-2 సార్లు వాడవచ్చు. 5. వేరుశనగ, పొద్దుతిరుగుడులో 1-2సార్లు వాడవచ్చు.




**తీసుకోవలసిన జాగ్రత్తలు :** 1. కుండలో ద్రావణాన్ని వేడిచేసేటప్పుడు, ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి. 2. ద్రావణాన్ని సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి.

**ఎలా పనిచేస్తుంది :** సహజంగా ఈ కషాయంలో ఉండే ఎన్నో రకాలఅల్కలాయిడ్‌లవలన పురుగులనియంత్రణలో ఈ కషాయం పనిచేస్తుంది. అంతేకాకుండా పంటలలో వచ్చే తెగుళ్ళను కూడా నియంత్రించడంలో పనికొస్తుంది.

**సూచన :** 1. పంచపత్ర కషాయం చాలా శక్తివంతమైన కషాయం. అందువలన దీనిని పంటలలో జాగ్రత్తగా పురుగు ఉధృతిని బట్టి పంట వయసును బట్టి వాడుకోవాలి. 2. పంట తొలిదశలో (40 రోజులవరకు రెండున్నర లీటర్ల కషాయం సరిపోతుంది (5 ట్యాంకులనీటివరకు). 3. పంట 60 రోజులనుంచి 90 రోజులవరకు 5 లీటర్ల కషాయం (10 ట్యాంకులనీటికి) అవసరం పడుతుంది.

## పశువులపేడ మూత్రం ద్రావణం తయారి

**తయారు చేసే పద్ధతి :** 5 కిలోలపశువులపేడ, 5 లీటర్ల పశువులమూత్రం, 5 లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టిలో గాని, కుండలోగాని నిల్వ చేయాలి. తొట్టిపై / కుండపై మూతపెట్టి 4 రోజులపాటు ఆ మిశ్రమాన్ని బాగా మురగబెట్టాలి. అప్పుడప్పుడూ మిశ్రమాన్ని కర్రతో బాగా కలపాలి. 4 రోజులతర్వాత ఈ మిశ్రమాన్ని వడబోసి దానికి 150 గ్రా. సున్నం కలపాలి. ఈ ద్రావణానికి 100 లీటర్ల నీరు చేర్చి ఎకరం పొలంలో పిచికారి చేయాలి.

**ఎలా పనిచేస్తుంది :** 1. ఈ ద్రావణంలో పంటకు కావలసిన వివిధ రకాలస్థూలపోషకాలు మరియు సూక్ష్మ పోషకాలు ఉండడం వలన పిచికారి చేసిన తరువాత మొక్కలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. 2. పశువులపేడ - మూత్రంలో చాలా రకాలసూక్ష్మజీవులు ఉన్నాయి ఇవి పంటకు తెగుళ్ళను కలుగజేసే రోగకారక శిలీంద్రాలను నిరోధిస్తాయి. 3. ఈ ద్రవమును పిచికారి చేస్తే రెక్కలపురుగులు పంటలపై ఆ వాసనకి గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు.

**ఎన్నిసార్లు వాడాలి :** 1. ఈ ద్రావణాన్ని అన్ని పంటలలోను, నారుమళ్ళలోను వాడవచ్చు. 2. లభ్యతను బట్టి ఈ ద్రావణాన్ని అన్ని పంటలలో 2 నుంచి 3సార్లు వాడవచ్చు.




**తీసుకోవలసిన జాగ్రత్తలు :** 1. తొట్టిలో/ కుండలో మురగబెట్టిన మిశ్రమాన్ని ప్రతిరోజూ కర్రతో బాగా కలియబెట్టాలి. (చేతులతో కలియబెట్టిన యెడలసున్నితమైన చర్మానికి దురద కలిగే అవకాశం వుంది) 2. పశువులపేడ - మూత్రం ద్రావణం తయారు చేసిన తరువాత తప్పనిసరిగా 150 గ్రా. సున్నం కలపాలి.

**నివారింపబడు తెగుళ్ళు :** 1. పశువులపేడ–మూత్రం, ఇంగువ ద్రావణం పంటలపై వచ్చే చాలా రకాలతెగుళ్ళ యాజమాన్యంలో పనిచేస్తుంది. 2. ఇంగువలో గంధకం (సల్ఫర్) మూలపదార్థం గా ఉండడం వలన ఇది తెగుళ్ళను కలుగజేసి శిలీంద్రాలను నివారిస్తుంది. 3. ఈ ద్రావణం వరిలో వచ్చు అన్ని రకాలతెగుళ్ళకు (అగ్గితెగులు, పొడ తెగులు, ఆకుమచ్చ తెగులు) పనిచేస్తుంది. 4. ఈ ద్రావణాన్ని పంటలలో వాడడం వలన కొన్ని రకాలబాక్టీరియా తెగుళ్ళను కూడా అరికట్టినట్లు రైతులు చెబుతున్నారు. 5. పంట దశలో రెండుసార్లు వాడడం ద్వారా తెగుళ్ళు ఒక మొక్కనుండి వేరొక మొక్కకు వ్యాప్తి చెందకుండా ఈ ద్రావణం కాపాడుతుంది. 6. ఇంగువలో సల్ఫర్ ఉండడం వలన ఇది ఎర్రనల్లిపై కూడా కొంతవరకు పనిచేస్తుంది.

**గమనిక :** తెగుళ్ళ నివారణకు పై ద్రావణానికి 150 గ్రాములసున్నంతో పాటు 200 గ్రాములఇంగువ కలపాలి.

## నీలగిరి ఆకులకషాయం

**తయారు చేసే పద్ధతి :** 1. 5 కిలోలనీలగిరి (యూకలిప్టస్) ఆకులను తీసుకుని దానికి 10 లీటర్ల నీరు చేర్చి కనీసం అరగంటసేపు బాగా ఉడకనివ్వాలి. 2. మధ్యమధ్యలో ఉడుకుతున్న ద్రావణాన్ని కర్రతో కలుపుతూ ఉండాలి. 3. కషాయాన్ని మాగా చల్లార్చి పలుచని గుడ్డతో వడపోయాలి. 4. తయారైన ద్రావణానికి 100 గ్రా. సబ్బుపొడి (ఖాదీ సబ్బు) ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని 100 లీ. నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రం పూట పిచికారి చేయాలి.

**నివారింపబడు తెగుళ్ళు :** 1. ఈ కషాయం పంటలలో వచ్చు ఆకుమచ్చ తెగుళ్ళకు బాగా పనిచేస్తుంది. ఉదా.: వేరుశనగలో వచ్చు తిక్క, ఆకుమచ్చ, వరిలో వచ్చు ఆకుమచ్చ ఇతర పంటలలో వచ్చు ఆకుమచ్చ తెగుళ్ళకు దీనిని వాడవచ్చు. 2. ఈ కషాయం వాడడం ద్వారా తెగుళ్ళు కలుగజేసే శిలీంద్రాలవ్యాప్తిని అరికట్టవచ్చు.

**సూచన :** 1. పై విధంగానే పంటలలో వచ్చు తెగుళ్ళ నివారణకు పిచ్చి తులసి (కుక్క తులసి) ఆకులు, అత్తాకోడలు (లాంటానా కెమేరా) ఆకులకషాయం కూడా వినియోగించవచ్చు. దీనిని తయారు చేసే విధానం పైన చెప్పిన నీలగిరి ఆకులు కషాయం లాగానే తయారు చేయాలి. 2. పైన చెప్పిన వివిధ రకాలకషాయాలు తయారు చేసిన వెంటనే పంటలపై పిచికారీ చేయాలి. నిల్వ ఉంచరాదు.


## సీతాఫలం ఆకులకషాయం


**తయారు చేసే పద్ధతి :** 1. 10 కిలోలసీతాఫలం ఆకులు తీసుకుని వాటిని 10 లీటర్ల నీటిలో 30 నిమిషాలపాటు బాగా ఉడకనివ్వాలి. 2. ఉడుకుతున్న ద్రావణాన్ని మధ్యమధ్య లో కర్రతో బాగా కలపాలి. 3. కషాయాన్ని బాగా చల్లార్చాలి. 4. కషాయాన్ని పలుచని గుడ్డతో వడబోసి 100 గ్రాములసబ్బుపొడి కలపాలి. ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి సాయంత్రంపూట బాగా తడిసేటట్లు పిచికారి చేయాలి.

**నివారింపబడు తెగుళ్ళు :** 1. సీతాఫలం కషాయం పిచికారీ చేయడం ద్వారా వరిలో వచ్చు అగ్గితెగులు, మెడవిరుపు తెగుళ్ళని నివారింపవచ్చు. 2. వేరుశనగ, మిరప, కూరగాయలపంటలలో వచ్చు మచ్చ తెగుళ్ళను నివారించటంలో ఈ కషాయం కొంతవరకు ఉపయోగపడుతుంది.

**సూచన :** 1. పై విధంగానే పంటలలో వచ్చు తెగుళ్ళ నివారణకు మారేడు ఆకులకషాయం కూడా వినియోగించవచ్చు. దీనిని తయారు చేసే విధానం కూడా పైన చెప్పిన సీతాఫలం ఆకులకషాయంలాగానే తయారు చేయాలి. 2. పైన చెప్పిన కషాయాలు తయారు చేసి వెంటనే పంటలపై పిచికారీ చేయాలి. నిల్వ ఉంచరాదు.

## సీతాఫలం ఆకుల కషాయం





# గ్యాస్ ఆధారిత బేకరీ ఓవెన్

## తయారు చేసిన 'చిడిపి నాగభూషణం'

తాను చేస్తున్న పనిని ఇష్టపడమన్నారు. అలాగే ఇష్టపడిన పనినే చేయమన్నారు. ఇది చేసి చూపించిన వ్యక్తి మన 'చిడిపి నాగభూషణం'. అవునండీ ఇతను బేకరీ పనులలో శిక్షణ పొంది బేకరీ నడిపేవాడు. అదే అతని జీవనాధారం. చేస్తున్న పనిపై మక్కువ, గౌరవం ఉంది కనుకనే బేకరీలో పని సులభంగా, త్వరగా జరగటానికి గ్యాస్‌తో పనిచేసే 'ఓవెన్' కనిపెట్టాడు. నలుగురి ప్రశంసలూ పొందటంతో పాటు నలుగురికి జీవనోపాధి చూపించిన వాడైనాడు.


ఇక వివరాల్లోకి వెళితే రాజమండ్రికి దాదాపు 14 కి.మీ. దూరంలోనున్న సీతానగరం మండలం లోని 'మునికొడలి' గ్రామంలో జన్మించాడు నాగభూషణం. తల్లి గెల్లమ్మ, తండ్రి చిందిపాల్. రోజువారి కూలీ చేసి జీవనం సాగించేవారు. రాజమండ్రిలోని ఆంధ్రకేసరి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ మానేశాడు. తల్లిదండ్రులను కోల్పోయిన పదోక్లాసు పాసైన ఇతనికి అమ్మమ్మ ఆశమ్మ గారి (ఇప్పుడీమెకి 90 సంవత్సరాల వయస్సు) ప్రోద్బలంతో కాకినాడ డి.ఆర్.డి.ఎ.లో బేకరీ పనుల్లో శిక్షణ పొందాడు. అదే అతని జీవనాధారమైంది. తానిప్పుడీ స్థితిలోనుండి నలుగురికీ సహాయ పడగలుగు తున్నానంటే అంతా అమ్మమ్మ గారి చలవ, దీవెన, ప్రోద్బలం అంటాడు నాగభూషణం.

బొమ్మూరం గ్రామంలోని మహిళా ప్రాంగణంలో 1980 నుండి ఫుడ్ ప్రాసెసింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరి, అక్కడికి జీవనోపాధికై వచ్చే మహిళలకి బిస్కెట్లు, పళ్ళ రసాలు, జాములు, జెల్లీలు తయారు చేయటం నేర్పించేవాడు. ఆరునెలలకు ఒక బ్యాచ్ వస్తూ వుండేది, వెళుతూ వుండేది. జీవనం సాఫీగానే సాగుతుందనుకున్నా, ఇతని మనసులో ఒక సమస్య వేధిస్తూ వుండేది. ఇతర శిక్షణలు పొందుతున్నవారికి జీవనోపాధి కొనసాగించటానికి ఏదో ఆధారం చూపబడుతూ వుండేది. కాని, తనవద్ద శిక్షణ పొందుతున్న వారు శిక్షణానంతరం ఏమి చేయాలి? వారికీ జీవనాధారం చూపిస్తే బావుంటుంది కదా, వాళ్ళ బతుకులు



వారు బ్రతికే మార్గం చూపించగలిగితే ఒక మంచి పని చేసినవాన్నవుతాను అన్న ఆలోచన వచ్చేది. చాలా మందితో తన ఆలోచన గురించి చెప్పాడు. కొందరు విన్నారు, కొందరు బావుందన్నారు. మరికొందరు ఇదంతా నీకెందుకు, నీకు చెప్పిన పనిచెయ్ చాలు అన్నారు. ఎవరేమన్నా, ఆలోచన మాత్రం చేస్తూనే వున్నాడు. అప్పటివరకు అందరూ ఆ మాటకొస్తే తన శిక్షణలో కూడా బేకరీలలో ఇటుకల కొలిమిలో కట్టెలనే వాడేవారు. రానురాను కట్టెలు దొరకటం దుర్లభమైపోగా, వాటి ఖర్చు కూడా పెరుగుతూ వచ్చింది. వాటి పొగతో పర్యావరణం కూడా కలుషితమై పోతోంది. బేకరీ ఓవెన్‌లో కట్టెలబదులు గ్యాస్ వాడితే ఎలా వుంటుదన్న ఆలోచన వచ్చిందీయనకి.

తన ఆలోచనని సి.టి.ఆర్.సి. శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ కళ్యాణి గారికి వివరించారు. ఆవిడ ఎంతో ఉత్సాహం చూపి, ప్రోత్సహించి, ఒక గ్యాస్‌తో నడిచే బేకరీ ఓవెన్ తయారు చేయటానికి ధనసహాయం కూడా చేశారు. గ్యాస్‌ఓవెన్ తయారైంది. అంతా అబ్బురపడ్డారు,



మెచ్చుకున్నారు. దానికింకా మెరుగులు దిద్ది రెండోది తయారు చేశాడు. ఇతను రూపొందించిన ఓవెన్ ప్రత్యేకత ఏమిటంటే, ఒకటి గ్యాస్‌తో పనిచేయటము, రెండవది బేకరీలలో ఒక్కొక్క ట్రే (డెక్)లకి రెండు బర్నర్లుండాలి. కానీ, ఈయన తయారు చేసిన ఓవెన్‌కి రెండు ట్రేలకి మూడు బర్నర్లు మాత్రమే సరిపోతాయి. అంటే గ్యాస్‌ను ఆదా చేయవచ్చు కూడా.

తానే స్వంతంగా ఒక బేకరీ ప్రారంభించాడు (అమ్మమ్మ గారి ప్రోద్బలముందని వేరే చెప్పక్కర్లేదు). తన బేకరీలో బిస్కెట్లు, బ్రెడ్లు, కేకులు, దిల్ పసంద్‌లు, కరీపఫ్‌లు మొదలైనవి తయారు చేసి, అమ్ముతూ ఉంటాడు. ఆ సమయంలో అంటే దాదాపు పదిహేనేళ్ళ క్రితం నాగభూషణానికి పద్మతో వివాహమైంది. ఇప్పుడు వీరికి బాల్‌రాజ్ అనే కుమారుడున్నాడు. భాష్యం పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు.

నాగభూషణం తయారు చేసిన ఓవెన్‌లు రెండు







రకాలు. ఒకటి చిన్నది, దీనికి దాదాపు రూ. 8 వేలు ఖర్చవుతుంది. రెండవది పెద్దది దీనికి సుమారు రూ. 12వేలు ఖర్చవుతుంది. కావలసిన వారికి ఒక వారం రోజుల్లో తయారు చేసి ఇవ్వగలనంటాడు ఇతను. తన ఓవెన్‌లో దిల్‌పసంద్‌లు, బ్రెడ్లు, కేకులు, కరీపఫ్‌లు సుమారు 20 నుండి 25 నిమిషాల్లో చేయవచ్చునని, బన్నులు కేవలం 10 నిమిషాల్లో తయారు చేయవచ్చునని చెప్పారు.

ఇవన్నీ ఒకయెత్తయితే, ఈయన తన బేకరీలో చేసిన సరుకులు దుకాణంలో అమ్మటమే కాక, మొబైల్ అమ్మకాలు కూడా చేపట్టారు. ఎలాగంటారా! అక్కడే ఉంది ఈయన కల్పనా శక్తి. ఒక పాత మోటార్ సైకిల్‌కి వెనక భాగంలో ఒక చిన్న ఓవెన్ బిగించాడు. మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకుపై గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేశాడు. ఇంకా ఒక లైటు, వీడియో కూడా ఏర్పాటు చేసుకుని, చల్ మోహన రంగా అంటూ నాలుగు వీధులూ తిరిగి తాను చేసిన సరుకులు వేడి వేడిగా వినియోగదారులకి అప్పటికప్పుడు అందిస్తూ వుంటాడు. దీనితో రాజమండ్రికి రాకుండానే తోవలోనే ఈయన


స్వయం ఉపాధిలో నూతన ఒరవడి

గ్యాస్ ఆధారిత ఓవెన్ తయారీలో నాగభూషణం విజయం

పరిశోధించి సాధించారు

తక్కువ ఖర్చుతో గ్యాస్ ఓవెన్

సిటీ లైఫ్

చదువు లేని సైంటిస్టు

ఉపాయముంటే ఉపాధికి కొదవా?

సరుకులు వేడివేడిగా అమ్ముడౌతున్నాయి. తాను రూపకల్పన చేసిన గ్యాస్ ఓవెన్‌లో బేకరీ వస్తువులు చేయటం ఒక యెత్తయితే, వాటిని వినియోగదారులఇంటిముందు వేడివేడి గా సప్లయ్ చేయటం ఒకయెత్తు కదూ! తన బుల్లి ఓవెన్‌లో అన్నము, కోడి కూర లాంటివి కూడా చకచకా వండేయొచ్చం టాడు ఈ ఇన్నోవేటర్. తను బేకరీ సమాన్లు తయారు చేయటానికి, పిండి కలపటానికి కూడా ఒక యంత్రాన్ని తయారు చేసుకున్నాడు. దాంతో సమయం కూడాఎక్కువ ఆదా అవుతోంది.

ప్రస్తుతం తన దుకాణంలో రెండు షోకేస్‌లు ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. శిక్షణా కార్యక్రమాల్లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూనే బేకరీ వస్తువులు తయారు చేయటం ఇతరులకి నేర్పుతూ, నిరుద్యోగ యువతీ యువకులకి జీవనోపాధి కల్పించుకోవటానికి వారికి ఓవెన్‌లు తయారు చేస్తూ వున్నాడు. ఈవిధంగా తనకి తాను జీవనోపాధి కల్పించుకోవటమే కక, నలుగురికి బ్రతుకు తెరువు చూపిస్తున్నందుకు చాలా గర్వంగా ఉందంటాడు నాగభూషణం.



తనవద్ద కొనుగోలు చేసిన గ్యాస్ ఓవెన్‌లని పర్యవేక్షిస్తూ వుండటం, అవసరమైతే చిన్నచిన్న రిపేర్లు చేయటం కూడా చేస్తూవుంటాడు. ఓవెన్‌లపై పెట్టిన ఖర్చు ఒకటి లేదా రెండేళ్ళలో రాబట్టుకోవచ్చునంటాడు. ఇప్పుడు తను ఆర్థికంగా కొంత పుంజుకోగల్గినా, భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ మందికి ఈ ఓవెన్‌లు, మొబైల్ అమ్మకాలమోటార్ బైక్‌లు ఏర్పాటు చేయటం గురించి ఆలోచిస్తున్నాడు. తాను తయారు చేసే ఓవెన్‌లు ఇంకా నాణ్యంగా ఉండం కోసం తనకొక వెల్డింగ్ యంత్రము, ఒక గ్యాస్ వెల్డింగ్ యూనిట్ ఉంటే బాగుంటుందని కోరుకుంటున్నాడు.

ప్రస్తుతం నేరుగా గ్యాస్‌పైన పెట్టి బేకరీ వస్తువులు ఇళ్ళలోనే తయారుచేసుకోవటానికి అనువైన గృహ పరికరంగా ఒక చిన్న ఓవెన్ కూడా రూపొందించి ఇంకా దానికి మెరుగులు దిద్దే కార్యక్రమంలో ఉన్నాడు. దీని సహాయంతో ఎవరైనా, ఎపుడైనా వేడివేడి బ్రెడ్‌లు, కేకులు, బిస్కట్లు తమ ఇళ్ళల్లోనే తయారు చేసుకునే అవకాశం త్వరలోనే ఏర్పడబోతోంది.

మొబైల్ సేల్స్ పెంచుకోవటానికి ఇంకా ఓవెన్‌లు బిగించిన వాహనాలు తయారు చేసి, ఎక్కువ మందికి గ్యాస్ ఓవెన్‌లను అందుబాటులోకి తెచ్చి ఉపాధి లేక బాధపడుతున్న యువతకు జీవనోపాధి కల్గించి వారి బ్రతుకొక ఆధారం చూపించాలన్న ఆసక్తిని వ్యక్తం చేశాడు నాగభూషణం.

నాగభూషణం తయారు చేసిన, చేయబోయే ఓవెన్‌లకి ఆయనకు అవసరమైన యంత్రాలు, పనిముట్లతో పాటు మొబైల్ సేల్స్ పెంచుకోవటానికి మొబైల్ యూనిట్లని కూడా ఏర్పరచుకోవటానికి ఏవిధమైన సహాయం కావాలన్నా అందించటానికి 'పల్లెసృజన' ముందుంటుందని ఎన్.ఐ.ఎఫ్. కో-ఆర్డినేటర్, 'పల్లెసృజన' సంఘం అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు హామీ ఇచ్చారు. అతి త్వరలో ఈ ఓవెన్‌లను రాష్ట్రం నలుమూలలకి సరఫరా అయ్యేలా 'పల్లెసృజన' తగిన ఏర్పాటు చేస్తోంది. ఈ యంత్రం పేటెంట్‌కు, దేశవ్యాప్త అమ్మకానికి హనీబీఎపి పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇవ్వటం జరిగింది. ఈ ఓవెన్‌లపై ఆసక్తి గలబేకరీ యజమానులు, నిరుద్యోగ యువతీ యువకులు 'పల్లెసృజన'ని సంప్రదిస్తే తగిన ఏర్పాటు చేయటం జరుగుతుంది.

# మన ఔషధ మొక్కలు



\- జట్టు ట్రస్టు వారి సౌజన్యంతో....

### గోరింటాకు

**ఇతర పేర్లు :** మదయంతీ

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, పూలు, విత్తులు, కాండం బెరడు

**మొక్క ఆకారము :** నేలబారుగాగాని, నిటారుగాగాని, నీరున్న స్థలాలలో 50 సెం.మీ. పెరిగే ఏకవార్షికపు మొక్క.

**మొక్క ఆకారం :** 2–4 మీటర్లు పెరిగే పెద్ద మొక్క, చిన్న పలవలు, నాలుగు పలకల ముండ్లవలె ఉంటాయి. పూలు చిన్నవి. తెల్లగా గుత్తులు గా వస్తాయి. పండ్లు గుండ్రం గా కుంకుడుగింజంత ఉంటా యి. విత్తనాలు ముక్కోణా కారంలో ఉంటాయి.



**ఉపయోగాలు :** గోరింటాకు చర్మరోగాలను నయం చేస్తుంది. బెరడు, విత్తనాలు జ్వరాన్ని, విరేచనాలను తగ్గిస్తాయి. గోరింటాకులను మెత్తగా రుబ్బి చేతులకు, కాళ్ళకు పట్టిస్తే ఫంగస్ వలన వచ్చు చర్మవ్యాధులు తొలగిపోతాయి. వ్రేళ్ళ సందులలో వచ్చే గజ్జి, వ్రణాలు మానుతాయి. కాలి పగుళ్ళు తగ్గుతాయి. గోరింట ముద్దను తలకు పట్టిస్తే వెంట్రుకలు నల్లబడి, బాగా పెరుగుతాయి. చలువ చేస్తుంది. తలనొప్పి రాకుండా చేస్తుంది. గోరింటాకును ఎండించి పొడిచేసి జల్లించగా వచ్చిన పొడితో చిక్కని కషాయం కాచి, పుక్కిలిస్తే, నోటిలో వచ్చే పుండ్లు మానిపోతాయి. గొంతునొప్పి, గొంతువాపు, చెవిలో చీము వంటివి ఉన్నా తగ్గిపోతాయి.

20 మి.లీ. కషాయం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తీసుకుంటే అతిసారం తగ్గుతుంది. స్త్రీలకు నెలసరి ఋతుక్రమం సరిగ్గా వచ్చేటట్లు చేస్తుంది.

### చింత

**ఇతర పేర్లు :** చింతా, తింత్రిణి

**దొరుకు చోటు :** కొండలపై, ఊరిబయట, కొన్నిచోట్ల పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, కాయలు, వ్రేళ్ళు, విత్తులు



**మొక్క ఆకారము :** 20 మీటర్ల వరకు పెరిగే చెట్టు, పత్రాలు పక్షవత్ సంయుక్తం. పత్రకాలు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి.

**పూలు :** పసుపు రంగులో గుత్తులుగా వస్తాయి.

**కాయలు :** కొడవలి లాగ ఉంటాయి. చింతపండు నవంబరు నుండి ఏప్రిల్ వరకు దొరుకును.

**ఉపయోగాలు :** 5-6 ఫలాలగుజ్జును, 100 గ్రా. ఉప్పుతో కలిపి మెత్తగా ఉడికించి, బెణుకులు, వాపులపై రాత్రిపోట వేసి కట్టు కడితే తెల్లారేసరికి ఉపశమనం కలుగుతుంది. చింత ఆకులను నీడలో ఆరబెట్టి, పొడిచేసి ఒక వారం రోజులు ఉదయం, సాయంత్రం చెంచాడు వంతున తీసుకుంటే నులిగడుపు తగ్గుతుంది. తేలుకుట్టినచోట చింతపండు చిక్కని రసం పూత పూస్తే ఉపశమనం కలుగుతుంది. లేత చింత, అడ్డరసం, తులసి ఆకులను సమాన బరువులో తీసుకుని మొత్తం బరువులో 1/4 వ వంతు అల్లం, అంతే బరువులో మిరియాలు తీసుకొని, దంచి ముద్దగా చేసి రసం తీసి, రెండుపూటలా రెండు చెంచాలు తీసుకుంటే జలుబు, దగ్గు వాటితో వచ్చే జ్వరం తగ్గుతాయి.

### జామ

**ఇతర పేర్లు :** మాంసల, పెరుఖ

**దొరుకు చోటు :** పెరుడులలో పెంచుతారు, చిట్టడవులలో వుంటాయి, తోటలుగా పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, పండ్లు, బెరడు, వేర్లు.

**మొక్క ఆకారము :** నేలబారుగాగాని, నిటారుగాగాని, నీరున్న స్థలాలలో 50 సెం.మీ. పెరిగే ఏకవార్షికపు మొక్క.

**ఆకులు :** దీర్ఘ వృత్తాకారంలో ఉంటాయి.

**పూలు :** తెల్లగా ఉంటాయి.

**కాయలు :** గుండ్రంగా, ఆకుపచ్చగా ఉంటాయి.



**ఉపయోగాలు :** జామపండ్లు ఆరోగ్యానికి మంచివి, బలవర్ధకం, పుష్టినిస్తాయి. ఆకులను నీడలో ఆరబెట్టి, గుండ చేసి, వస్త్ర ఘాలితం చేయగా వచ్చిన పొడిన ఐదు గ్రాములచొప్పున ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సేవిస్తే జిగత, నీళ్ళ విరేచనాలనుండి ఉపశమనం కలుగుతుంది. జామ బెరడు ముద్ద కాలిన గాయాలు, పొక్కులపై పదే పదే

పూస్తూవుంటే ఉపశమనం కలుగుతుంది. జామ ఆకురసం తీసి, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 15 రోజులు బాగా పుక్కిలించి ఉమ్మితే దంతక్షయం నివారించబడుతుంది. ఆకులను ఎండలో పెట్టి, చూర్ణించి, వస్త్ర ఘాలితం చేసి, ఉదయం, సాయంత్రం రెండేసి చెంచాలచొప్పున 3 మాసాలు తీసుకుంటే స్కర్వీ వ్యాధి ఉపశమనం కలుగుతుంది. వేరు రక్తస్రావాన్ని ఆపుతుంది. చిన్న పిల్లల్లో వచ్చు నీళ్ళ విరేచనాలకు మంచి మందు.

### తులసి

**ఇతర పేర్లు :** కృష్ణతులసి, లక్ష్మితులసి.

**దొరుకు చోటు :** పొలాలగట్లపైన, ఇండ్లలో, దేవాలయ ఆవరణలో, పూజించటం కోసం పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** సమూలంగా

**మొక్క ఆకారము :** ఒక మీటరు ఎత్తువరకు పెరిగే బహువార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు రెండు చొప్పున కోలగాను లేదా అండాకారంలో ఉండి, అంచులకు దంతాలవంటి నొక్కులతో ఉంటాయి.

**పూలు :** చాలా చిన్నవి. తెల్లగా నీలి ఛాయ కలిగిన లేత ఎరుపుతో సన్నగా, నిడువుగా, గుత్తులుగా కొమ్మలచివర వస్తాయి.

**కాయలు :** నాలుగు విత్తనాలుగా విడినట్లుండి, రక్షకపత్రాలలోపలఉంటాయి. తులసి సంవత్సరమంతా దొరుకుతుంది.



**ఉపయోగాలు :** క్రిములను పోగొడుతుంది. మంచి విరేచనకారి, ఇది కొద్దిగా చేదు, కారము కలది. పిల్లలకు తులసి ఆకు రసంలో అల్లం లేక తేనె చేర్చి యిచ్చిన కడుపుబ్బరము, కడుపునొప్పి, దగ్గు తగ్గిపోతాయి. పిల్లలవయస్సు ఇతర ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాడవలసి వుంటుంది. నిమ్మకాయ రసంతో ఈ ఆకు నూరి, ఆ ముద్దను చర్మ రోగమున్న భాగాలపై పూసిన తామర మున్నగు చర్మరోగములు తగ్గిపోతాయి. ఆకులరసం రెండు చెంచాలు ఉదయంపూట, పుచ్చుకుంటే కఫం తగ్గుతుంది. కృష్ణతులసి రసం రెండు చెంచాలు, రెండు మిరియాలతో కలిపి తీసుకుంటే దగ్గు తగ్గుతుంది. ఒక చెంచాడు తులసిరసం ప్రతిరోజూ సేవిస్తూ మొలలకు పూస్తే మొలలబాధ నుండి 40 రోజుల్లో ఉపశమనం కలుగుతుంది.

### దానిమ్మ

**ఇతర పేర్లు :** దాడిమ

**దొరుకు చోటు :** తోటలలో, ఇండి పెరడులలో

**ఉపయోగపడు భాగాలు :** పండ్లు, విత్తులు, పూలు, కాండం బెరడు.

**మొక్క ఆకారము :** 3-6 మీటర్ల ఎత్తు పెరిగే వృక్షం.

**ఆకులు :** కణుపుకు రెండు చొప్పున నిడివిగా కుంభ కటకాకారంలో ఉంటాయి.

**పూలు :** ఎఱ్ఱగా ఉంటాయి.

**కాయలు :** పసుపు రంగులోను, విత్తులు లేత గులాబీ రంగులో, కండతో ఉంటాయి.

**ఉపయోగాలు :** దానిమ్మ జీర్ణశక్తిని పెంచుతుంది. కఫ,



వాతాలను పోగొడుతుంది. పూలు రక్తస్రావాన్ని తగ్గిస్తాయి. దానిమ్మ గింజలు ఆకలిని పెంచుతాయి. రుచిని కలిగిస్తాయి. ప్రేవులలో మంటను తగ్గిస్తాయి. దానిమ్మ గింజలలో ఇనుము, విటమిన్లు సమృద్ధిగా ఉండటం వలన మంచి పోషకాహారం. కాయ పైపొరను ఎండించి, పొడిచేసి రోజుకు 5 గ్రా. చొప్పున 40 రోజులు సేవిస్తే ఆకలి పెరుగుతుంది. అల్సర్లు తగ్గుతాయి. అమీబియాసిస్‌కు మంచి మందు. లేత పిందెలు లేక కాయ తొక్కను చిక్కని మజ్జిగతో బాగా నూరి 5 గ్రా. మోతాదులో ఉదయం, సాయంత్రం సేవిస్తే రక్తబేదులు, అతిసారము, బంకబేదులనుండి ఉపశమనం కలుగుతుంది.

## నేరేడు

**ఇతర పేర్లు :** అలంనేరేడు, అల్లనేరేడు, జంబూ

**దొరుకు చోటు :** అడవులలో, తోటలలో పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు, బెరడు, ఆకులు.

**మొక్క ఆకారము :** పెద్ద చెట్టు.

**ఆకులు :** దీర్ఘ వృత్తాకారం మరియు అండాకారంతో, 7-15 సెం.మీ. పొడవు, 3-6 సెం.మీ. వెడల్పుతో ఉంటాయి.

**పూలు :** కుంకులలో అమరిన తెలుపు రంగు.

**కాయలు :** నీలి ఎరుపు రంగు పండ్లు.

**ఉపయోగాలు :** బెరడు తాజారసాన్ని 5 మి.లీ., రెండు రెట్లు మేకపాలతో కలిపి సేవిస్తే నీళ్ళ విరేచనాలు తగ్గుతాయి. బెరడు కషాయంతో పుండ్లను కడిగితే ఉపశమనం కలుగుతుంది. రక్తవిరేచనాలకు రెండు పూటలా 10 మి.లీ. స్వచ్ఛమైన ఆకురసాన్ని సేవిస్తే ఉపశమనం కలుగుతుంది. పండిన పండ్లు రసాన్ని త్రాగితే జీర్ణాశయానికి బలం కలుగుతుంది. పండురసం కడుపులో వాయువులు తగ్గించుటకు మూత్రం జారీ చేయుటకు ఉపయోగిస్తారు. నేరేడు విత్తనాలపొడి, పొడపత్రి ఆకులపొడి, సమాన నిష్పత్తిలో కలిపి, ప్రతిరోజూ రెండు పూటలా 5 గ్రా. మోతాదుగా 40 రోజులు తీసుకుంటే మధుమేహము నుండి ఉపశమనం కలుగుతుంది.

## నేలఉసిరి

**ఇతర పేర్లు :** భూధాత్రీ, భూ ఆమ్లకీ

**దొరుకు చోటు :** తేమగా ఉన్న ఖాళీ ప్రదేశాలలో, పొలాలగట్లపై లభిస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** సమూలంగా15-75 సెం.మీ. పెరుగు ఏకవార్షిక మొక్క. ఆకులు చిన్నవిగా, పక్షవత్ సంయుక్తంగా రాచ ఉసిరి ఆకులవలె ఉంటాయి.

**ఉపయోగాలు :** సమూలంగా శుభ్రపరచి ముద్దగా నూరి, పది గ్రాములముద్దను 25 గ్రా. పెరుగుతో ఉదయం పరగడుపున 5 రోజులు త్రాగాలి. మరియు కేవలం మజ్జిగతో చప్పడి భోజనం చేయాలి. పచ్చకామెర్ల నుండి ఉపశమనం





కలుగుతుంది. శుభ్రపరిచిన 10 గ్రా. వ్రేళ్ళ ముద్దను 1 గ్లాసు ఆవుపాలతో కలిపి రెండుపూటలా 15 రోజులు సేవిస్తే పాండురోగం తగ్గుతుంది. దీని ఆకులను మజ్జిగతో నూరి గజ్జి, చిముడులపై పట్టిస్తే చర్మవ్యాధులు నయమవుతాయి. 15 గ్రా. లేత ఆకులను 200 గ్రా. నీళ్ళలో పోసి, సన్నని సెగపై 100 గ్రా. తేలిక కషాయం చేసుకొని మెంతులముద్దను కలుపుకొని రెండు పూటలూ సేవిస్తే విరేచనాలనుండి ఉపశమనం కలుగుతుంది. నేలఉసిరి ఆకును నీడలో ఎండించి, చూర్ణం చేసుకొని 5 గ్రా. బియ్యం కడుగుతో సేవిస్తే తెల్లబట్ట తగ్గిపోతుంది.

## పసుపు

**ఇతర పేర్లు :** హరిద్రా

**దొరుకు చోటు :** పసుపును పండిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** పసుపు దుంపలు.

**మొక్క ఆకారము :** ఇది ఒకటిన్నర మీటర్ల ఎత్తువరకు పెరుగు బహువార్షికపు మొక్క.

**ఆకులు :** పెద్దవిగా వెడల్పుగా కుంభ కటకాకారంలో వుండి, క్రింది భాగంలో కాడలాగా సన్నబడి ఉంటాయి.

**పూలు :** లేత పసుపు రంగులో కొమ్మ చివర ఆకుపచ్చ లేక లేత గులాబీరంగు పుష్ప పుచ్ఛాలతో కూడిన కంకివలె తయారవుతాయి.

**ఉపయోగాలు :** ముత్యమంతా పసుపు – ముఖమంతా ఛాయ అని అంటారు. ముఖానికి పసుపు రాసుకుంటే నల్లని మచ్చులు, మొటిమలు తగ్గిపోతాయి. పసుపును నువ్వుల నూనెలో కలిపి కాలి వ్రేళ్ళమధ్య పూస్తే ఒరుపులు రకుండా జాగ్రత్త పడవచ్చు. పసుపు నీళ్ళతో కలిపి పాదాలకు పైపూతగా పూస్తే ఫంగస్ వ్యాధులు, గజ్జి, బ్యాక్టీరియాల నుండి ఉపశమనం కలుగుతుంది. పసుపును మంచి బెల్లంతో సమానంగా కలిపి ప్రతిరోజూ ఉదయం రెండు చెంచాలు తీసుకుంటే కడుపులో మంట తగ్గుతుంది. కడుపులోని అల్సర్లు తగ్గుతాయి. శరీరంపై దద్దుర్లు కూడా నెమ్మదిగా తగ్గుతాయి. వేడి పాలలో చిటికెడు పసుపు కలిపి ఇస్తే జలుబు, దగ్గు తగ్గిపోతాయి.

## పొడపత్రి

**ఇతర పేర్లు :** పుట్టభద్ర, మేషశృంగి, మధునాని

**దొరుకు చోటు :** పొదలపై అల్లుకొనే తీగ

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, వ్రేళ్ళు

**మొక్క ఆకారము :** బహువార్షిక పొదు. 10 మీటర్ల వరకు పెరుగుతుంది.

**ఆకులు :** కణుపుకు రెండేసి, అండాకారంలో ఉంటాయి

**పూలు :** లేత పసుపు రంగులో నక్షత్రాలవలె ఉండి గుత్తులుగా వస్తాయి.

**కాయలు :** సన్నగా పొడవుగా జంటలుగా వస్తాయి.

**ఉపయోగాలు :** ఆకులను పొడిచేసి, వస్త్రఘాలితం చేయగా వచ్చిన పొడిని, ఒకభాగం పసుపు ఒక బాగం ఉసిరి పొడి కలిపి ప్రతిరోజు ఉదయం, సాయంకాలం రెండుసార్లు సేవిస్తే రక్తంలోని చక్కెర శాతం బాగా తగ్గుతుంది. ఎక్కువసార్లు మూత్రం రావడం తగ్గుతుంది. దప్పిక ఉండదు. దీని ఆకులకు, నేరేడు మొక్క ఆకులను పదేసి చొప్పున అరలీటరు నీటిలో వేసి 50 మిల్లీ లీటర్ల కషాయానికి





మరిగించి, వడకట్టి, ఉదయం, సాయంకాలసమయాల్లో పరగడుపున పూటకు చెంచాడు చొప్పున పావు చెంచాడు తేనెతో కలిపి 3 నెలలపాటు తీసుకుంటే మధుమేహం నుండి ఉపశమనం కలుగుతుంది.

## బొప్పాయి

**ఇతర పేర్లు :** బొప్పాసి, మదన ఆనబ, ఏరండకర్కటి

**దొరుకు చోటు :** తోటలలో పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** పండ్లు, కాయలు, కాయలనుండి వచ్చు పాలు.

**మొక్క ఆకారము :** 5–6 మీటర్ల ఎత్తు పెరిగే వృక్షం. మానుబోలుగా మెత్తగా ఉంటుంది.

**ఆకులు :** ఆముదం ఆకులవలె ఉంటాయి.

**కాయలు :** గుండ్రంగా, కోలగా ఉంటాయి. విత్తనాలు నల్లగా, ఎండితే మిరియాలలాగా ఉంటాయి.

**ఉపయోగాలు :** బాగా పండిన బొప్పాయి ఫలాలు తినటం వలన విరేచన మాంద్యాన్ని నివారించవచ్చు. బొప్పాయి పాలకు అంతే చక్కెరను చేర్చి, బాగా కలిపి ఉదయంపూట ఖాళీ కడుపుతో రోకు రెండు చెంచాలచొప్పున సేవిస్తే జిగట విరేచనాలనుండి ఉపశమనం కలుగుతుంది. లేత బొప్పాయి కాయలపాలను పదే పదే పూస్తూ వుంటే పుండ్లు తగ్గిపోతాయి. ఇవికాక చర్మరోగాలనివారణకు, శ్వాసకోశ వ్యాధులనుండి ఉపశమనానికి, ఆకలి పుట్టించటానికి,



జీర్ణక్రియకు మూలవ్యాధి వలన రక్తం చిందడం నివారించటానికి ఉపయోగిస్తారు.

## మందార

**ఇతర పేర్లు :** దాసనము

**దొరుకు చోటు :** పెరడులలోను, పూలతోటలలోను.


**ఉపయోగపడు భాగాలు :** పసుపు దుంపలు.

**మొక్క ఆకారము :** నాలుగు మీటర్ల ఎత్తువరకు పెరిగే బహువార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు ఒకటి చొప్పున ఇంచుమించు అండాకారంలో ఉండి, అంచులకు దంతాలవంటి నొక్కులు ఉంటాయి.

**పూలు :** ఎఱ్ఱగా, పెద్దవిగా ఐదు వెడల్పయిన రేకులతో ఉంటాయి. సంవత్సరమంతా మందారపూలు దొరుకుతాయి.

**ఉపయోగాలు :** పుష్పాలు వాపులను, నొప్పులను, మంటలను తగ్గించి చలువ చేస్తాయి. జ్వరాన్ని, తాపాన్ని క్రమంగా తగ్గించి చల్లపరుస్తాయి. ఋతుస్రావాన్ని క్రమబద్ధం చేస్తాయి. పువ్వులను నూరిన ముద్ద వాపులమీద గడ్డలమీద పూస్తారు. పూలకషాయాన్ని శ్వాస నాళాలవాపులకు వాడతారు. పూలను నేతిలో వేయించి, అధికమైన ఋతుస్రావాన్ని అరికట్టడానికి వాడతారు. ఆకులు చల్లదనాన్ని కలిగిస్తాయి. విరేచనాన్ని కలిగిస్తాయి. నొప్పిని తగ్గిస్తాయి. ఆకులకషాయాన్ని జ్వరానికి శరీరంపై రాస్తారు. వేరు చలువ చేస్తుంది. దగ్గును తగ్గిస్తుంది. కషాయాన్ని సుఖవ్యాధులనివారణకు వాడతారు. వేళ్ళ పొడిన అధికమైన ఋతుస్రావాన్ని తగ్గించుటకు వాడతారు.



# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్

# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

## దోమ ఒక్కటి - జబ్బులు ఐదు

**పాఠకులకు నమస్సులు....**

దోమలవల్ల మనకు చాలా జబ్బులు వస్తాయి. అయితే ప్రధానంగా వేదించేవి ఐదు జబ్బులు. 1. మలేరియా, 2. మెదడువాపు వ్యాధి, 3. డెంగీ జ్వరం, 4. చికున్ గున్యా, 5. బోద వ్యాధి (ఫైలేరియా). మలేరియా, మెదడువాపు, డెంగీ జ్వరం మన ప్రాణాలు తీయవచ్చు. చికున్ గున్యా దీర్ఘకాల నొప్పులతో వేదిస్తుంది. బోధ వ్యాధి శాశ్వత అంగవైకల్యం కలిగిస్తుంది.

**దోమల నివారణ చర్యలు :**

- మీ ప్రాంతంలో దోమలు ఎక్కువగా ఉంటే పంచాయితి లేదా మునిసిపల్ అధికారులకు తెలియజేయండి.
- క్రిమిసంహారక మందులు ఇంట్లో చల్లినప్పుడు ప్రతి గదిలోను చల్లించండి. మందు చల్లిన తర్వాత గోడలు తుడవరాదు. గోడలకు సున్నం వేయరాదు.
- దోమల నివారణకి పొగ వదిలినప్పుడు (ఫాగింగ్) – ఇంట్లో కిటికీలు, తలుపులు తెరచి ఉంచండి.
- మీ ఇల్లు చుట్టూ నీరు నిల్వకుండా, మురుగునీటి కాల్వలలో చెత్తా చెదారం చేరకుండా జాగ్రత్త పడండి. మీ ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకొనండి.
- మురుగునీటి కాల్వలలో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో కిరోసిన్, ఇతర దోమ సంహారక మందులు చల్లించండి.
- దోమలు ఎక్కువగా ఉన్నప్పుడు కాళ్ళూ, చేతులు పూర్తిగా కప్పుకొనండి.
- మీకు వీలైతే మీ ఇంటి కిటికీలకు, తలుపులకు దోమలు రాకుండా మెష్ అమర్చుకోండి.
- వారానికి ఒకరోజు, నీటితొట్లు, పాత్రలు, కుండీలు, కూలర్లలో నీరు పూర్తిగా తీసివేయండి. దీనినే 'డ్రైడే' పాటించడం అంటారు.
- దోమల నివారణకు దోమతెరలు వాడటం అత్యుత్తమమైన మార్గం.

## కుక్క కరిస్తే.....

**కుక్క కరిచిన వెంటనే.....**

- గాయాన్ని వెంటనే సబ్బు, నీటితో బాగా కడగండి. కొద్దిపాటి రక్తస్రావం జరిగినా ఫరవాలేదు. ఇది అన్ని చర్యలకన్న మంచి చర్య.
- కడిగిన తర్వాత గాయంపై, గాయం చుట్టూ టింక్చరు అయోడిన్ దొరికితే పూయండి.
- దగ్గరలోని ఆరోగ్య కార్యకర్త నుండి కానీ, ఆసుపత్రి నుండి కానీ, 'టెటనస్ టాక్సాయిడ్' సూది ఇప్పించండి.
- గాయానికి కుట్లు వేయించకండి. కట్టు కట్టించండి. అంగళ్లలో దొరికే ప్లాస్టర్లు అతికించకండి.
- గాయానికి పసుపు, సున్నం, కాఫీపొడి లాంటివి పూయకండి.
- గాయానికి ఎలాంటి ఆయింట్‌మెంట్ పూయకండి.

**కుక్కను గురించి తెలుసుకోండి**

- మిమ్మల్ని కరిచిన కుక్క గురించి వీలైతే తెలుసుకోండి. కుక్క ఆహారం మానినా, మామూలుకన్నా ఎక్కువగా అరుస్తున్నా, వణుకుతున్నా, కుక్కకు 'ఫిట్స్' ఉన్నా, నోటి నుంచి చొంగ ఎక్కువగా కారుతున్నా – అది పిచ్చి కుక్క కావచ్చు. మీరు వైద్యులను సంప్రదించి తగిన వైద్యం తీసుకొనండి.
- మిమ్మల్ని కరిచిన కుక్క పదిరోజుల తర్వాత ఆరోగ్యంగా ఉంటే సాధారణంగా మీకు ఎలాంటి ప్రమాదం రాకపోవచ్చు.
- మిమ్మల్ని కరిచిన కుక్క గురించి మీకు ఏమీ తెలియకపోతే ప్రథమ చికిత్స తర్వాత వైద్య సలహా పొందండి.

ఈ అంశాలు మీ స్నేహితులతో, బంధువులతో, సహచరులతో మాట్లాడండి.

– సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ..
ఓపియస్‌డిహెచ్.


# శక్తి బుల్లెట్ శాంతి

## మోటార్ సైకిల్‌తో నడిచే నాగలి

గుజరాత్‌లోని అమరెల్లి పట్టణానికి చెందిన, 5వ తరగతి వరకు చదువుకున్న 'మన్సుఖ్‌భాయ్ అంబా భాయ్ జగాని' కి ఒక వెల్డింగ్ యూనిట్ ఉంది. చుట్టుప్రక్కల రైతులు తనవద్దకు వచ్చి వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో లేకపోవటం, పెరుగుతున్న ఖర్చులను గురించి వివరిస్తూ ఏదైనా ఒక పరిష్కారాన్ని ఆలోచించమని కోరగా, ట్రాక్టరు, పవర్ ట్రిల్లర్‌లకి అయ్యే ఖర్చు భరించలేని సాధారణ రైతులకు తక్కువ ఖర్చుతో పనిచేసి, ఎక్కువ ఉత్పాదకతను అందించటానికి ఈ మోటార్ సైకిల్‌తో నడిచే నాగలిని రూపకల్పన చేశాడు. 325 సిసి లేదా 6.5 హెచ్.పి. కన్నా ఎక్కువ శక్తిగల ఏ మోటార్ సైకిల్‌కైనా ఈ పరికరం వెనక చక్రం ఉండే ప్రదేశంలో బిగించుకోవచ్చు. ఇది తేలికగానే ఉంటుంది కనుక భూమిలోకి కూరుకుపోయే ప్రసక్తి లేదు. దీనితో సుమారు 4 ఎకరాల పొలాన్ని ఒక గంటలో దున్నుకోవచ్చు ఇందుకయ్యే ఖర్చు అరలీటరు పెట్రోలు మాత్రమే. దీనికి కొద్దిపాటి మార్పులు చేసి, సేద్యపు పనులకు, విత్తనాలు వేయటానికి, అంతర్ సేద్యానికి, క్రిమిసంహారక మందులు పిచికారి చేయటానికి, వ్యవసాయ రవాణాకు కూడా ఉపయోగించే విధంగా తయారు చేశాడు. అవసరం లేనప్పుడు వెనకవైపు బిగించిన పరికరాన్ని తొలగించి చక్రం వేసుకుంటే మామూలు మోటార్ సైకిల్‌గా వాడుకోవచ్చు.



ఈ పరికరాలను తయారు చేసుకోవటానికి మోటార్ సైకిల్ కాకుండా పరికరాలకు దాదాపు 35 వేల రూపాయలు అవుతుంది. ఇతర వివరాలకు క్రింది చిరునామాను సంప్రదించి వివరాలు తెలుసుకోగలరు.





**కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :**


**GIAN**
Banglow No. 1, Satellite Complex, Stellite Complex, Satellite,
Ahmedabad - 380 015. INDIA.
Ph. : 079-26769686, Fax : 079-26760398.
E_mail : gian@gian.org
Website : www.gian.org

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక


## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక


**రూ. 20/-లు మాత్రమే!**



సంపుటి 1, సంచిక 1




సంపుటి 1, సంచిక 2




సంపుటి 1, సంచిక 3



సంపుటి 1, సంచిక 4




సంపుటి 2, సంచిక 1




సంపుటి 2, సంచిక 2




సంపుటి 2, సంచిక 3




సంపుటి 2, సంచిక 4



సంపుటి 3, సంచిక 1



సంపుటి 3, సంచిక 2



సంపుటి 3, సంచిక 3



సంపుటి 3, సంచిక 4



సంపుటి 4, సంచిక 1



సంపుటి 4, సంచిక 2



సంపుటి 4, సంచిక 3

### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 1,500/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 2,500/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 3,750/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 6,500/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Aruna Ganesham, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
A/c No. 905 520 100 773 62

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655